షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 232 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం, 04 జూన్ 2024 పేజీలు 8 : వెల 3/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 232 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE July 04, 2024 PAGES : 8 PRICE : 3/-

## మరోసారి ఆల్‌టైమ్ రికార్డ్‌లు సృష్టించిన సూచీలు

భారీ లాభాల్లో పరుగులు పెట్టిన దేశీయ స్టాక్ మార్కెట్

తొలిసారి 80,000 కీలక మైలురాయిని తాకిన సెన్సెక్స్

న్యూఢిల్లీ,జూలై3(షణ్ముఖవెలుగు): దేశీయ స్టాక్ మార్కెట్ మరోసారి భారీ లాభాల్లో పరుగులు పెట్టింది. ఇక సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు సరికొత్త రికార్డుల్ని సృష్టించాయి. అంతర్జాతీయంగా సానుకూల పవనాలు దేశీయ మార్కెట్లకు దన్నుగా నిలిచియాయి. దీంతో ఆరంభ ట్రేడింగ్‌లోనే రెండు ప్రధాన సూచీలు రికార్డు గరిష్ఠాలను తాకాయి. తొలిసారి సెన్సెక్స్ 80,000 కీలక మైలురాయిని

మిగతా 2లో..



## అవినీతిపరులు చట్టంనుంచి తప్పించుకోలేరు



నల్లధనం, అవినీతిపై మరింత కఠినంగా ఉంటాం

కేంద్ర దర్యాప్తు సంస్థలకు పూర్తిస్వేచ్ఛను ఇచ్చాం

మణిపూర్ అల్లర్ల బాధ్యులపై కఠిన చర్యలు

రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై చర్చలో ప్రధాని మోడీ

ప్రధాని ప్రసంగం మధ్యలో విపక్షాల నినాదాలు

తీవ్రంగా మందలించిన చైర్మన్ ధన్‌కడ్

**నిరసనగా రాజ్యసభలో విపక్షాల వాకౌట్**

న్యూఢిల్లీ,జూలై3(షణ్ముఖవెలుగు): దేశాన్ని పట్టి పీడిస్తున్న నల్లధనం, అవినీతి భూతాన్ని నాశనం చేసేందుకు మరింత కఠినంగా వ్యవహరిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యసభలో ప్రకటించారు. అందుకోసం తమ సర్కార్ కేంద్ర దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చిందన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా వీటి నుంచి అవినీతిపరులు తప్పించుకోలేరని హెచ్చరించారు. తమపై మోదీ సర్కార్ ఈడీ, సీబీఐలను ప్రయోగిస్తోందని ప్రతిపక్షాలు కొంతకాలంగా తీవ్ర ఆరోపించడంపై ప్రధాని మోదీ తీవ్రంగా స్పందించారు. దర్యాప్తు సంస్థలు నిజాయితీగా పని చేస్తాయి. ఏ అవినీతిపరుడు చట్టం నుంచి తప్పించుకోలేడు. ఇది మోదీ గ్యారంటీ. అవినీతి, నల్లధనంపై నిలువరించేందుకు కఠినచర్యలు తీసుకునేందుకు మా ప్రభుత్వం దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛనిచ్చిందని ఈ సందర్భంగా దేశ ప్రజలకు తెలియజేస్తున్నా. వాటి చర్యల్లో మా సర్కార్‌కు ఎలాంటి పాత్ర లేదు అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దిల్లీ మద్యం కుంభకోణాన్ని ప్రస్తావించిన మోదీ.. ఆమ్ ఆద్మీ పార్టీతో సహా కాంగ్రెస్‌పై మండిపడ్డారు. 'ఆప్ అవినీతికి పాల్పడింది. మద్యం కుంభకోణానికి తెర తీసింది. పలు కుంభకోణాలతో పాటు మరెన్నో దుశ్చర్యలకు పాల్పడింది. ఆప్ చర్యలపై కాంగ్రెస్ కూడా ఫిర్యాదు చేసింది. కానీ, ఇప్పుడు ఆప్‌పై చర్యలు తీసుకుంటే మోదీపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి అని ప్రతిపక్షాల తీరును దుయ్యబట్టారు.నాడు ఆప్ కుంభకోణాలకు సంబంధించిన సాక్ష్యాలను కాంగ్రెస్ మీడియా ముందు పెట్టిందని గుర్తు చేశారు. 'ప్రస్తుతం ఆ రెండు పార్టీలు ఒక్కటయ్యాయి. ఆప్‌పై గతంలో హస్తం పార్టీ చెప్పినవి సత్యాలా లేక అసత్యాలా?దీనిపై కాంగ్రెస్ వివరణ ఇవ్వాలి అని ప్రధాని డిమాండ్ చేశారు. అవినీతి నిర్మూలనే ఎన్డీఏ లక్ష్యమని.. ఎన్నికల్లో గెలుపోట ములు తమకు ముఖ్యం కాదని పేర్కొన్నారు. గత ఏడాది మేలో మణిపూర్ లో చెలరేగిన హింసాకాండ దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. మణిపూర్ అల్లర్లపై ప్రధాని వివరణ ఇవ్వాలని మంగళవారం లోక్ సభలో ప్రతిపక్షాలు డిమాండ్ చేశారు. బీజేపీ మణిపూర్ లో హింసను ప్రోత్సహిస్తున్నాయని ప్రతిపక్షాలు ఆరోపించాయి.

మిగతా 2లో..

## జార్ఖండ్‌లో మారిన సమీకరణాలు

సీఎం చంపై సోరేన్ రాజీనామా

మళ్లీ సిఎంగా హేమంత్ సోరెన్

పార్టీ నేతలు ఏకగ్రీవ నిర్ణయం



రాంచి,జూలై3(షణ్ముఖవెలుగు): జార్ఖండ్ సీఎం చంపై సోరేన్ రాజీనామా చేశారు. బుధవారం రాజీనామా లేఖను గవర్నర్ కు సమర్పించారు. జార్ఖండ్ ముక్తి మోర్చా ప్రెసిడెంట్ హేమంత్ సోరేన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకు రావడంతో చంపై సోరేన్ రాజీనామా చేశారు. రాంచీలోని రాజ్‌భవన్‌లో

మిగతా 2లో..

## జగన్ ఐదేళ్ల పాలనలో అమరావతి విధ్వంసం

మళ్లీ అమరావతికి ప్రాణప్రతిష్ట చేసి తీరుతాం

ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా నిర్మిస్తాం

ప్రతి తెలుగు బిడ్డ అమరావతి గర్వంగా చెప్పుకునేలా చేస్తా

మళ్లీ పెట్టుబడిదారుల విశ్వాసం చూరగొంటాం


దేశంలోని పవిత్ర జలాలు, మట్టి ఇక్కడ చేరుకున్నాయి

అందుకే మహిమాన్విత ప్రాంతాన్ని ఏమీ చేయలేకపోయారు

గోదావరి, కృష్ణా నదుల మధ్యలో ఉండేలా అమరావతికి శ్రీకారం

త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టి..అద్భుత నగరంగా తీర్చిదిద్దుతాం

అమరావతి విధ్వంసంపై శ్వేతపత్రం విడుదల చేసిన సిఎం చంద్రబాబు



అమరావతి,జూలై3(షణ్ముఖవెలుగు): ప్రపంచంలోనే అతిపెద్ద భూ సేకరణ ప్రాజెక్టు అమరావతి అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రపంచం మెచ్చేలా రాజధాని నిర్మించాలని సంకల్పించి, అతిపెద్ద భూసేకరణ చేశామని, కానీ గత ఐదేళ్ల కాలంలో జగన్ దానిని విధ్వంసం చేశారని అన్నారు. ఇప్పుడు ఎన్ని కష్టాలు ఎదురైనా పునర్నిర్మాణం చేసి తీరుతామని ప్రకటించారు. ఇది ఏ ఒక్కరి రాజధాని కాదు.. యావత్ రాష్ట్ర ప్రజలదని తెలిపారు. ప్రతి తెలుగు బిడ్డ అమరావతి నాది అని గర్వంగా గుర్తించాలి.. చెప్పుకోవాలన్నారు. కొత్తగా ప్రణాళికలు ఏమీ లేవని, పాత వాటినే కొనసాగిస్తూ నిర్మాణం చేస్తామని తెలిపారు. రాజధాని అమరావతిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం శ్వేతపత్రం విడుదల చేశారు. ఉద్యోగ, ఉపాధి కోసం తాను అమరావతిని నిర్మించాలని చూస్తే జగన్ విధ్వంసం సృష్టించారని పూర్తి వివరాలు ప్రకటించారు. జగన్ ప్రభుత్వం చేసిన అరాచక పనుల కారణంగా వరల్డ్ క్లాస్ క్యాపిటల్‌గా మారాల్సిన అమరావతి ఇప్పుడు దెబ్బతిన్నదన్నారు. అమరావతిలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు.

మిగతా 2లో..

## ఉప్పాడ తీరం కోతలపై అధ్యయనం

నిపుణుల సలహా మేరకు చర్యలు

ఉప్పాడ తీరాన్ని పరిశీలించిన పవన్ కళ్యాణ్

కారణాలను అధికారులతో చర్చించిన డిప్యూటీ సిఎం

గెలపించారు.. డిప్యూటీ సిఎంగా చేశారు

చరిత్రలో ఇంత ఘన విజయం ఊహించలేదు

పిఠాపురం వారాహి బహిరంగ సభలో పవన్ కళ్యాణ్

ఉప్పాడలో పవన్ కళ్యాణ్‌కు ఘనంగా స్వాగతం



కాకినాడ,జూలై3(షణ్ముఖవెలుగు): ఉప్పాడ తీరం భారీగా కోతకు గురవుతోంది. గత ఏడాదిన్నర కాలంగా ఏకంగా ఎకరం మేర భూభాగం సముద్రంలో కలిసిపోయింది. తీరం తీవ్రంగా ధ్వంసమైంది. ఈ కోతను ఆపేందుకు చర్యలు తీసుకుంటామని పవన్ కళ్యాణ్ ఇప్పటికే చెప్పారు. చెన్నై నుంచి వచ్చే నిపుణుల బృందం ఉప్పాడ తీరాన్ని పరిశీలించి దాన్ని రక్షణకు అవసరమైన చర్యలు సూచిస్తుందని, తదనుగుణంగా తీర సంరక్షణ చేపడతామని హామీ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మూడో రోజు కాకినాడ జిల్లాలో పర్యటిస్తున్నారు. వాకతిప్ప ఫిషింగ్ హార్బర్, సూరప్ప తాగునీటి చెరువుతో పాటు ఉప్పాడలో కోతకు గురైన తీరప్రాంతాన్ని పవన్ బుధవారం పరిశీలించారు. తీర ప్రాంతం కోతకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో

మిగతా 2లో..

## నదుల అనుసంధానంతోనే నీటి సమస్యకు చెక్

పోలవరం ప్రాజెక్టుతోనే నదుల అనుసంధానం సాకారం

పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కృష్ణా డెల్టాకు నీరు విడుదల

వెల్లడించిన మంత్రి నిమ్మల రామానాయుడు



ఏలూరు,జూలై3(షణ్ముఖవెలుగు): దేశాన్ని కరవు రహితంగా మార్చాలంటే నదుల అనుసంధానమే మార్గమని ఏపీ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది సీఎం చంద్రబాబేనని చెప్పారు. పోలవరం ప్రాజెక్టుతోనే నదుల అనుసంధానం సాకారమన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు సాగు, తాగునీటిని మంత్రి విడుదల చేశారు. 4, 5, 6 పంపుల ద్వారా 1,050క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. అక్కడ

మిగతా 2లో..

## తీర్మానాలతో ప్రత్యేకహోదా అసాధ్యం

అది ముగిసిన అధ్యాయం

పోలవరం పూర్తికి కేంద్రం పూర్తి సహకారం

కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ వెల్లడి

న్యూఢిల్లీ,జూలై3(షణ్ముఖవెలుగు): ఏపీ అభివృద్ధికి ఎలాంటి సహకారం కావాలో ఆలోచించి ముందుకు వెళ్తామని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. వైకాపా ప్రభుత్వ వైఫల్యం వల్ల పోలవరం సమస్యల్లో ఉంది. ఆ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహకారం ఉంటుందని శ్రీనివాసవర్మ తెలిపారు. దిల్లీలో రాష్ట్ర ఎన్డీయే ఎంపీలతో సీఎం చంద్రబాబు సమావేశమవుతారని చెప్పారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ కార్యాలయంలో 'అమ్మ' పేరుతో మొక్క నాటిన అనంతరం ఆయన మాట్లాడారు.

మిగతా 2లో..

## జగన్మోహన్ రెడ్డికి భారీ షాక్

సీబీఐ, ఈడీ కేసులపై ఇక రోజువారీ విచారణ

తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు

కేసు మూడు వారాలకు వాయిదా



హైదరాబాద్,జూలై3(షణ్ముఖవెలుగు): వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి భారీ షాక్ తగిలింది. ఆయనపై నమోదైన సీబీఐ, ఈడీ కేసుల విచారణలను రోజువారీగా చెపట్టాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. జగన్‌పై నమోదైన సీబీఐ, ఈడీ కేసులను రోజువారీ విచారణ చేపట్టి తేల్చేసేలా హైదరాబాద్ సీబీఐ కోర్టుకు ఆదేశాలివ్వాలంటూ హరిరామజోగయ్య తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు పిల్ దాఖలు చేశారు.. సీబీఐ, ఈడీ కేసులు లేని నేతను ఎన్నుకోవాలని ప్రజలు అనుకుంటున్నారని.. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసుల్లో నిందితుడైన జగన్ వరుస పిటిషన్లు వేసి విచారణలో జాప్యం చేస్తున్నారన్నారు. ఈ పిటిషన్ ను ఎన్నికలకు ముందే దాఖలు చేశారు. రోజువారీ విచారణ చేపట్టాలని ఆదేశించింది. ఈ క్రమంలో మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. జగన్ కేసులపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. సీబీఐ కోర్టులో ఉన్న జగన్ కేసులను రోజువారీ విచారణ చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది. దీనిపై వాదనలు వినిపించిన ప్రభుత్వ న్యాయవాది కోర్టులో దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. తదుపరి విచారణను హైకోర్టు 3 వారాలకు వాయిదా వేసింది. ఇదిలావుంటే జగన్ కేసుల విచారణ వేగంగా సాగడం లేదని ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయాలని మాజీ ఎంపీ, ప్రస్తుత ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

మిగతా 2లో..

## నేడు దేశవ్యాప్తంగా స్కూళ్లు, కాలేజీలు బంద్

నీట్, నెట్ పరీక్షల లీకేజీపై నిరసన

సమగ్ర విచారణ చేపట్టాలని బంద్‌కు పిలుపు

న్యూఢిల్లీ,జూలై3(షణ్ముఖవెలుగు): నీట్, నెట్ పరీక్షల లీకేజీపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ జులై 4న దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల బంద్‌కు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఎన్టీఏ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాదు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాపై నిరసన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో 65 పేపర్ లీకేజీ ఘటనలు జరిగాయి. కాగా, నీట్, నెట్ పరీక్షల లీకేజీపై పార్లమెంట్‌లో మోదీ సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, పీడీఎస్‌వో,

మిగతా 2లో..

## హాథ్రస్ ఘటనలో 121కి చేరిన మృతుల సంఖ్య

మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం

హత్రాస్ తొక్కిసలాటపై పుతిన్ సంతాపం

హాథ్రస్,జూలై3(షణ్ముఖవెలుగు): ఉత్తరప్రదేశ్ హాథ్రస్ లో జరిగిన తొక్కిసలాటలో మృతుల సంఖ్య గంట గంటకు పెరుగుతోంది. ఈ ఘటనలో మృతి చెందినవారి సంఖ్య 116కి చేరింది. మృతుల్లో 108 మంది మహిళలు, ఏడుగురు చిన్నారులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ ఘటనతో బోలే బాబా ఎవరు అని పోలీసులు ఆరా తీస్తున్నారు.

మిగతా 2లో..

## ఎపిలో ఇక కొత్త ఇసుక పాలసీ

ఉచితంగా ప్రజలకు అందించేలా చర్యలు

మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

అమరావతి,జూలై3(షణ్ముఖవెలుగు): ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఈ నెల 8 నుంచి కొత్త ఇసుక పాలసీ అమల్లోకి రానుంది. తిరిగి ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకొస్తుంది ఏపీ ప్రభుత్వం. ఎన్నికల హామీ మేరకు ప్రజలకు ఫ్రీగా ఇసుక అందించనున్నట్లు తెలుస్తోంది. అందుకోసం.. కలెక్టర్ల అధ్యక్షతన లోడింగ్, రవాణ ఛార్జీల నిర్ణయం తీసుకోనున్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి కొల్లు రవీంద్రకు సీఎం చంద్రబాబు ఆదేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత ఇసుక విధానం ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారన్నారు. ఉచిత ఇసుక విధానం అమలుకు విధి విధానాలు రూపొందించుకుంటున్నామని తెలిపారు. వచ్చే మూడు నెలల్లో ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గత ఐదేళ్ల కాలంలో ఇసుక దోపిడీ జరిగిందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులైన పేదల కడుపు కొట్టిందని.. నిర్మాణాలు నిరంతరాయంగా జరగాలనేది సీఎం చంద్రబాబు ఆకాంక్ష అని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో ఉచిత ఇసుక విధానం అమలు అవుతూందని.. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో సుమారు కొన్ని నెలల పాటు ఇసుక అందకుండా చేసిందన్నారు. గత ప్రభుత్వ ఇసుక విధానం వల్ల కొన్ని కోట్ల మంది నష్టపోయారు.. రోడ్డున పడ్డారని తెలిపారు. రాష్ట్రంలో ఇసుక కొరత అనేదే లేకుండా చూస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఇసుకను పూర్తి స్థాయిలో అందుబాటులో



మిగతా 2లో..

# అవినీతిపరులు చట్టంనుంచి తప్పించుకోలేరు

మొదటిపేజీ తరువాయి..

దీనిపై మోదీ బుధవారం రాజ్యసభలో మాట్లాడారు. మణిపూర్‌లో శాంతి నెలకొల్పడానికి మా వంతు ప్రయత్నం చేస్తున్నామని ప్రధాని మోదీ అన్నారు. 11వేలకు పైగా ఎఫ్ఐఆర్ హింసకు కారణమైన వారిపై నమోదు చేశామని, అందులో 500 మందిని అరెస్ట్ కూడా చేశామని ఆయన తెలిపారు. మణిపూర్ సమస్యను రాజకీయం చేయడం మానేయండని ప్రధాని విపక్షాలపై మండిపడ్డారు. చాలా ప్రాంతాల్లో ఇప్పుడు పరిస్థితులు చక్కబడ్డాయని మోదీ అన్నారు. హింసాత్మక సంఘటనలు తగ్గుముఖం పడుతున్నాయని వివరించారు. 2023 మేలో ఇంఫాల్ వ్యాలీకి చెందిన మెయిటీస్, కొండజాతి అయిన కుకీ వర్గాల మధ్య వర్గపోరు నడిచింది. దాదాపు ఇప్పటికీ వరకు ఆ అల్లర్లలో 200 మందికి పైగా చినిపోయారు. తాజాగా జూన్‌లో కూడా మళ్లీ అక్కడ తెగలు ఘర్షణలకు దిగారు. అబాద్ధాలు చెప్పే వారికి నిజాన్ని వినే శక్తి లేదన్నారు ప్రధాని మోదీ. తమ ప్రభుత్వం పదేండ్ల పాలన పూర్తి చేసుకుందని, ఇంకా ఇరవై ఏండ్లు మిగిలే ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రాజ్యాంగాన్ని తాము గౌరవిస్తామని, రాజ్యాంగం వల్లే తాను ప్రధాన మంత్రిని అయ్యానని చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వానికి రాజ్యాంగమే రక్ష అని చెప్పారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్తామని మోదీ చెప్పారు. తమపై విపక్షాలు ఎంత విష ప్రచారం చేసినా ప్రజలు నమ్మ లేదని, తమకే పట్టం కట్టారని అన్నారు. ప్రజాతీర్పును కొందరు జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. ఎంత చెప్పినా విపక్షం వినకపోవడం బాధాకరమని పీఎం అన్నారు. అరవై ఏండ్ల తర్వాత వరుసగా ఒక పార్టీ మూడో సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. వికసిత్ భారత్ సంకల్పంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. త్వరలోనే భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకోబోతున్నదని చెప్పారు. ఇదిలావుంటే రాజ్యసభలో విపక్షాల తీరుపై ఛైర్మన్ జగదీప్ ధన్కడ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ మాట్లాడుతుండగా రాజ్యసభలో ప్రతిపక్ష ఎంపీలు నీట్, మణిపూర్ అంశాలపై చర్చకు పట్టుబట్టారు. ప్రధాని అబద్దాలు చెబుతున్నారని నినాదాలు చేయడంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. అనంతరం ప్రధాని ప్రసంగాన్ని విపక్ష ఎంపీలు బహి ష్కరిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. దీంతో విపక్షాల తీరును ఛైర్మన్ ధన్కడ్ తప్పు పట్టారు. ఇది అత్యంత బాధకారమైన అమర్యాదకరమైన రోజన్నారు. ప్రతిపక్షాలతో చర్చలు జరిపి.. విజ్ఞప్తి చేసినా వినలేదన్నారు. వాళ్లు సభను కాదు.. మర్యాదను వదిలేశారంటూ వ్యాఖ్యలు చేశారు. విపక్షాలు రాజ్యాంగాన్ని అవమానించాయన్నారు. తనకు కాదు, వాళ్లు దేశ ప్రజలకు వెన్ను చూపారని... రాజ్యాంగానికి ఇంతకంటే ఘోర అవమానం ఉండదన్నారు. విపక్షం ఆత్మవిమర్శ చేసుకుంటుందని భావిస్తున్నానని ధన్కడ్ అన్నారు. ఈ క్రమంలో రాజ్యసభ నుండి బుధవారం ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. ప్రస్తుత సమస్యలపై చర్చ జరపాలన్న ప్రతిపక్షాల నినాదాలను పట్టించుకోకుండా రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై ప్రధాని మాట్లాడారు. కాంగ్రెస్ మాజీ చీఫ్, రాజ్యసభ ఎంపి సోనియాగాంధీపై ప్రధాని విమర్శలు గుప్పించారు. ఈ వ్యక్తులు ఆటోపైలెట్, రిమోట్ పైలెట్‌లతో ప్రభుత్వాన్ని నడపడానికి అలవాటు పడ్డారు. వారికి పనిమీద నమ్మకం లేదు. వేచి చూడటమే వారికి తెలుసు అంటూ గత మన్‌మోహన్ సింగ్ ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తూ వాకౌట్ చేశాయి. చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ వారిస్తున్నప్పటికీ.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సహా పలువురు ప్రతిపక్ష ఎంపిలు వాకౌట్ చేశాయి. ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేకు అవకాశం ఇవ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. విపక్షనేతను మాట్లాడేందుకు అనుమతించడం అంటూ నినాదాలు చేశారు. మాట్లాడేందుకు అనుమతించాలని ఖర్గే కూడా పదేపదే అభ్యర్థించారు. తాము తమ అభిప్రాయాలను తెలిపేందుకు అవకాశమివ్వాలని కోరారు. అసత్యాలు చెప్పడం ఆపండి. సిగ్గు పడండి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో చైర్మన్ సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

## జార్ఖండ్‌లో మారిన సమీకరణాలు

మొదటిపేజీ తరువాయి..

గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు జార్ఖండ్ సీఎం చంపై సోరెన్ రాజీనామా సమర్పించారు. బుధవారంమధ్యాహ్నం రాంచీలోని మాజీ సీఎం హేమంత్ సోరెన్ నివాసంలో ఇండియా బ్లాక్ ఎమ్మెల్యేల అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జార్ఖండ్ సీఎం గా తిరిగి బాధ్యతలు చేపట్టేందుకు హేమంత్ సోరేన్ ను ఎన్నుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జార్ఖండ్ సీఎం పదవికి చంపై సోరేన్ రాజీనామా చేశారు. హేమంత్ సోరేన్ జార్ఖండ్ సీఎం గా మరోసారి బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ క్రమంలో జార్ఖండ్ రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. హేమంత్ సోరెన్ మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ఈడీ కేసులో ఆయన బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న చంపై సోరెన్ సీఎం పదవికి రాజీనామా చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో ఇవాళ జార్ఖండ్ ముక్తి మోర్చా వర్గాలు మాట్లాడుతూ చంపై సోరెన్ స్థానంలో హేమంత్ సోరెన్ మళ్లీ సీఎంగా బాధ్యతలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపాయి. సీఎం చంపై సోరెన్ నివాసంలో జరిగిన సమావేశంలో జేఎంఎం శాసనసభా పక్ష నేతగా హేమంత్ సోరెన్‌ను ఎన్నుకోవాలని కూటమి నేతలు, ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు పేర్కొన్నాయి. జేఎంఎం వర్కింగ్ ప్రెసిడెంట్ హేమంత్ సోరెన్ రాష్ట్రంలోని పార్టీ నేతృత్వంలోని కూటమికి చెందిన ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం మూడోసారి ముఖ్యమంత్రి బాధ్యతుల చేపట్టే అవకాశం కనిపిస్తున్నది. అధికార మార్పిడి ఊహాగానాల మధ్య రాంచీలో ఇండియా కూటమి ఎమ్మెల్యేల సమావేశం జరుగనున్నది. ఈ సమావేశాన్ని హేమంత్ సోరెన్ ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఇటీవల భూకుంభకోణాని కి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ ఆయనను అరెస్టు చేసింది. దాదాపు ఐదు నెలల తర్వాత అంటే జూన్ 28న జైలు నుంచి విడుదలయ్యాడు. భేటీ నేపథ్యంలో సీఎం చంపై సోరెన్ ముఖ్య కార్యక్రమాలన్నింటిని రద్దు చేశారు. వాస్తవానికి బుధవారం రాష్ట్రంలో ఎంపిక చేసిన 1500 ఉపాధ్యాయులకు సీఎం చంపై సోరెన్ నియామకపత్రాలు పంపిణీ చేయాల్సి ఉంది. మంగళవారం సైతం సీఎం కార్యక్రమాలన్నీ రద్దయ్యాయి. హేమంత్ సోరెన్ అరెస్ట్ తర్వాత ఫిబ్రవరి 2న జార్ఖండ్ 15వ ముఖ్యమంత్రిగా చంపై సోరెణ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఇక నేడు జరుగబోయే సమావేశానికి హాజరుకావాలని పార్టీ సూచించిందని కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యే ఒకరు తెలిపారు. ఈ ఏడాది చివరలో జరుగనున్న ఎన్నికల వ్యూహంపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశానికి జార్ఖండ్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ గులాం అహ్మద్ మీర్, రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ ఠాకూర్ సైతం హాజరవుతున్నారు. రాష్ట్రంలో రాజకీయ అభివృద్ధే ఈ సమావేశం ఎజెండా అని జేఎంఎం అధికార ప్రతినిధి మనోజ్ పాండే తెలిపారు. భేటీలో ముఖ్యమంత్రితో పాటు హేమంత్ సోరెన్ సోదరుడు, మంత్రి బసంత్ సోరెన్ పాల్గొననున్నారు. జేఎంఎం ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామా చేయడంతో గాండే సీటు ఖాళీ అయ్యింది. అక్కడ జరిగిన ఉప ఎన్నికల్లో హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.



## హాథ్రస్ ఘటనలో 121కి చేరిన మృతుల సంఖ్య

మొదటిపేజీ తరువాయి..

భోలే బాబా గతంలో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఎస్సైగా విధులు నిర్వహించే వారని తెలుసుకున్నారు. 2006లో పోలీసు ఉద్యోగానికి రాజీనామా చేసిన తర్వాత సూరజ్ పాల్ సింగ్ తన పేరును సూరజ్ పాల్ సింగ్ భోలేబాబాగా మార్చుకున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని కస్గంజ్ జిల్లా బహదూర్ నగర్ గ్రామానికి చెందిన సూరజ్ పాల్ తండ్రి ఓ రైతు. సూరజ్ పాల్‌కు చిన్నప్పటి నుంచి ప్రబోధం అంటే ఆసక్తి ఉండేది. కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి తర్వాత ఎస్సైగా ప్రమోషన్ పొందాడు. 12 పోలీస్ స్టేషన్లతో పాటు, స్థానిక ఇంటిలిజెన్స్ యూనిట్‌లో కూడా పనిచేశారు. భోలే బాబా భక్తుల్లో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతోపాటు ప్రముఖ నాయకులు కూడా ఉన్నారని విచారణలో గుర్తించారు. ఘటనా స్థలంలో డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ టీం పరిశీలించాయి. గత కొన్ని రోజులుగా హాథ్రస్ జిల్లా ఫుల్‌రయీ గ్రామంలో భోలే బాబా సత్సంగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి నిన్నే చివరి రోజు. దీంతో బాబాను దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రమాదాని ప్రధాన కారణం.. బాబా పాదాల దగ్గర మట్టిని సేకరించేందుకు భక్తుల ఎగబడ్డారు. దీంతో.. ఒకరిపై ఒకరు పడి తొక్కిసలాట జరిగింది. ఊపిరాడక చాలా మంది మృతి చెందారు. అయితే.. మొదట మృతుల సంఖ్య ఇంత పెద్ద మొత్తంలో ఉంటుందని ఎవరూ ఊహించలేదు. కానీ.. తొక్కిసలాట జరిగిన దగ్గర మృతదేహాలను వెలికితీస్తే పదుల సంఖ్యల వస్తూనే ఉన్నాయి. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించగా.. కొంతమంది చికిత్స పొందుతూ మృతి చెందారు. మంగళవారం (జూలై 2) భోలే బాబా గంటన్నరపాటు ఈ కార్యక్రమం నిర్వహించాడు. ఆ తర్వాత బయలుదేరిన సమయంలో ఆయన పాదాలను తాకడానికి భక్తులు ఒక్కసారిగా ఎగబడటంతో తొక్కిసలాట జరిగింది. మైదానం చిత్తడిగా ఉండటంతో మరింత ప్రమాదకరంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన గ్రౌండ్‌లో.. దానికి కెపాసిటీకి మించి భక్తులు వచ్చారు. భక్తులకు సరిపడా ఏర్పాట్లు కూడా లేవు. నిన్న సాయంత్రం మూడున్నర గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సత్సంగ్ నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. యూపీ ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి 50 వేల రూపాయల పరిహారాన్ని ప్రకటించింది. లోక్ సభ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే ఈ ఘటన జరిగింది. సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తున్నపుడే ఘటన గురించి తెలియడంతో ఆయన వెంటనే సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు కేంద్రం ప్రభుత్వం తరుపున 2 లక్షల రూపాయల చొప్పున పరిహారం ప్రకటించారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన వ్యక్తం చేశారు. తొక్కిసలాటలో పలువురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇండియా కూటమి శ్రేణులు సహాయక చర్యల్లో పాల్గోవాలని రాహుల్ గాంధీ సూచించారు. ప్రతీఏటా భోలే బాబా సత్సంగ్ పేరుతో ఒక కార్యక్రమం నిర్వహిస్తాడు. గతంలో కూడా భోలే బాబా నిబంధనలను ఉల్లంఘించాడు. 50 మందితో సత్సంగ్ నిర్వహించేందుకు నామమాత్రపు అనుమతులు తీసుకుని.. 50 వేల మందితో నిర్వహించాడు. ఈసారి 80 వేల మందితో సత్సంగ్ నిర్వహించేందుకు అనుమతులు తీసుకోగా.. రెండున్నర లక్షల మందికి పైగా హాజరయ్యారు. తొక్కిసలాట జరిగి.. వచ్చినవారిలో అనేకమంది మరణిస్తుండగా.. ఆధారాలను అంతం చేసేందుకు కుట్రపన్నినట్లు తెలుస్తోంది. సత్సంగ్ నిర్వాహకులలో ఐదుగురిపై కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ చేశారు. కానీ.. వారిలో భోలేబాబా పేరులేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషాదకరమైన ఘటనపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. "ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన ఘోర ప్రమాదంపై అత్యంత హృదయపూర్వక సంతాపాన్ని అంగీకరించండి" అని పుతిన్ సందేశాన్ని రాయబార కార్యాలయం జోడించింది. "ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర మనోవేదనకు గురిచేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని విదేశాంగ మంత్రి జైశంకర్ ట్వీట్ చేశారు.

## ఉప్పాడ తీరం కోతలపై అధ్యయనం



మొదటిపేజీ తరువాయి..

ఆయన చర్చించారు. అంతకు ముందు స్థానిక నేతలు, జనసేన కార్యకర్తలు డిప్యూటీ సీఎంకు ఘనస్వాగతం పలికారు. పలువురు ఆయన వాహనంపై పూలు చల్లి అభిమానం చాటారు. ఉప్పాడ తీరంలో ఏడాదిన్నర కాలంగా ఎకరం భూభాగం సముద్రపు కోతలో కలిసిపోయిందని. ఇలా ధ్వంసం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కేరళలో అధ్యయనం చేసిన తర్వాత కోనసీమలో కొబ్బరి ఉత్పత్తులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధుల సాయంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సైన్సు అండ్ టెక్నాలజీని అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే నన్నయ్య యూనివర్సిటీలో ఉన్న రీసెర్చ్ స్కాలర్లను తీసుకెళ్లి ఉప్పాడ తీర సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేస్తామని చెప్పారు. కేంద్రం ఇస్తున్న జలజీవన్ మిషన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకుని అన్ని గ్రామాలకు రక్షిత తాగునీరందిస్తామని చెప్పారు. జనావాసాల్లో ఉన్న తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పు గోదా వరి జిల్లాలో ఏడాదికి వెయ్యి కోట్ల ఇసుక వ్యాపారం జరిగిందని ఐదేళ్లలో రూ.5 వేల కోట్ల రాబడి వచ్చినా జగన్ ప్రభుత్వం మాత్రం పంచాయతీల నిధులకు గండి కొట్టిందన్నారు. గనుల సీనరేజీ నిధులు సైతం ఇవ్వ కుండా దారి మళ్లించారని వీటన్నింటిపై అధికారులను నివేదిక కోరినట్టు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పారు. తమ ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వుకుని పంచాయతీలకు చిల్లిగవ్వ కూడా పన్ను చెల్లించలేదని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ పరిస్థితిని మార్చి ఉమ్మడి జిల్లాలో అన్ని పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి కలిగేలా చేస్తామన్నారు. కాకినాడకు అతి సమీపంలో ఉన్న కోరంగి మడ అడవులను గత వైసీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాల పేరుతో ధ్వంసం చేసిందని, వేల టన్నుల కంకరతో మడ భూములను చదునుచేసిందని, దీనివల్ల మడ అడవుల్లో ఉండే జీవరాశులు మనుగడ కోల్పోయే ప్రమాదం వాటిల్లిందన్నారు. తిరిగి మడ అడవుల అభివృద్ధికి చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. కోరంగిలో ఎకో టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కాకినాడ సముద్ర తీరంలో ఉన్న హోప్ ఐలాండ్‌ను సంరక్షిస్తామని, అక్కడున్న జీవులను కాపాడేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. పవన్ కల్యాణ్ మూడవ రోజు పర్యటనలో ఆసక్తికరమైన పరిణామం జరిగింది. ఉప్పాడలో కోతకు గురవుతున్న సముద్ర తీరాన్ని పరిశీలించేందుకు వెళ్తున్న కాన్వాయ్ ఒకచోట అకస్మాత్తుగా ఆగింది. అనూహ్యంగా పవన్ కల్యాణ్ కూడా కిందకు దిగడంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఆసక్తికరమైన ఈ ఘటనకు ఒక చిన్నోడు కారణమయ్యాడు. అటుగా పవన్ కల్యాణ్ కాన్వాయ్ వెళ్తుండగా.. తన ఇంటి ముందు నిలుచొని ఆ బాలుడు ఉత్సాహంతో జనసేన జెండాను ఊపుతూ కనిపించాడు. బుడ్డోడిని గమనించిన డిప్యూటీ సీఎం వెంటనే కాన్వాయ్‌ని ఆపించారు. కారు దిగి బాలుడిని ఆప్యాయంగా దగ్గరికి తీసుకొని కాసేపు ముచ్చటించారు. స్థానికులు ఈ దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించారు. దీంతో స్థానికులు అందరూ ఆశ్చర్యపోయారు. పవన్ చాలా సింప్లిసిటీని ప్రదర్శించారని, చాలా ఆశ్చర్యంగా ఆనందంగా ఉందని చెబుతున్నారు. కాగా ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఉప్పాడ వెళ్లే దారిలో ఈ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. పిఠాపురం ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించారని, తాను కోరుకోని డిప్యూటీ సీఎం పదవి వచ్చేలా చేశారని డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. నా విజయాన్ని మీకే అంకితం చేస్తున్నా. దేశ రాజకీయ చరిత్రలో ఇంత ఘన విజయం ఎవరూ సాధించలేరు. ఈ ఘన విజయానికి నాంది పడింది ఇక్కడి నుంచే అని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను బంపర్ మెజారిటీతో గెలిపించిన పిఠాపురం నియోజకవర్గానికి పవన్ కల్యాణ్ తొలిసారి వెళ్లారు. బుధవారం సాయంత్రం అక్కడ జరిగిన 'వారాహి బహిరంగ సభ'లో ఆయన ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 2014లో జనసేన పార్టీకి గుర్తింపు ఇచ్చారని, 2019లో ఉనికిని ఇచ్చారని అన్నారు. డొక్కా సీతమ్మ స్ఫూర్తితో కష్టంతో ఉన్న సగటు మనిషి కోసం నిలబడాలని పవన్ అన్నారు. 5 కోట్ల మంది ప్రజలు కొద్దిమందికి భయపడతారా?. అసెంబ్లీలోకి ఎలా అడుగుపెడతావో అని అన్నారు. ఆ విషయాన్ని నేను సీరియస్‌గా తీసుకోలేదు.. మీరు తీసుకున్నారు. హోం, రెవెన్యూ, ఆర్థిక శాఖలు తీసుకోమని నన్ను అడిగారు. కష్టమైనా, క్లిష్టమైనా ప్రజల కోసమే పంచాయతీరాజ్ శాఖను తీసుకున్నా. ప్రజలు డబ్బు విషయంలో ప్రతీ రూపాయికీ లెక్క అడుగుతున్నా అని పవన్ కల్యాణ్ అన్నారు. కాగా ఎమ్మెల్యేగా మరోసారి పిఠాపురం ప్రజల ముందు ఎమ్మెల్యేగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఇక అధికారులతో పార్టీ నేతలు మర్యాదగా వ్యవహరించాలని పవన్‌కల్యాణ్ సూచించారు. అధికారులపై దౌర్జన్యం చేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. 30 వేల మహిళలు అదృశ్యమైనా గత ప్రభుత్వం పట్టించుకోలేదని, బాలిక అదృశ్యం కేసును 9 నెలలైనా ఛేదించలేకపోయారని అన్నారు. 9 రోజుల్లోనే ఆ అమ్మాయి ఆచూకీ కనుగొన్నామని పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. గత ప్రభుత్వంపై ప్రజలకు విపరీతమైన ఆగ్రహం ఉందని, ఆ కోపం, ఆవేదన, బాధను మెజార్టీల రూపంలో చూపించారని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం అసలైన శక్తి ఏంటో ప్రజలు చూపించారని కొనియాడారు. కూటమి మెజార్టీలు చూసి సీనియర్ నేతలే ఆశ్చర్యపోయారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి అనుభవంతోనే ఒక్క రోజులోనే పెన్షన్లు ఇచ్చేశామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

## తీర్మానాలతో ప్రత్యేకహోదా అసాధ్యం

మొదటిపేజీ తరువాయి..

దేశంలో పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్క నాటాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా అంశంపై కేంద్రమంత్రి స్పందించారు. కేంద్ర, రాష్ట్రాల్లో ఒకే కూటమి ప్రభుత్వం ఉంది. ప్రత్యేక హోదా.. తీర్మానాలు చేస్తే ఇచ్చే అంశం కాదు. అలా అయితే దేశంలోని అన్ని రాష్ట్రాలూ చేస్తాయి. ఏపీకి ప్రత్యేక హోదా అంశంపై నేను చెప్పలేను. దీనిపై ప్రధాని నిర్ణయం తీసుకోవాలి. బిహార్‌కు కూడా ఇదే వర్తిస్తుంది. 'హోదా' ఎందుకు ఇవ్వడం లేదో గతంలో స్పష్టంగా చెప్పారు. ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు ప్రత్యేక హోదా స్థానంలో ప్యాకేజీ ఇచ్చారు. ఆ నిధుల ద్వారా రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంటుంది. ఏపీలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడటంతో ప్రత్యేక హోదాపై రాష్ట్ర ప్రజల్లో ఆశలు మళ్లీ చిగురించాయి. కూటమిలో కీలక పాత్ర ఉండటంతో ఎలాగైనా ప్రత్యేక హోదాకు ఒప్పించాలని టీడీపీ అధినేత చంద్రబాబుకు ఒత్తిళ్లు మొదలయ్యాయి. కానీ ఇలాంటి తరుణంలో ప్రత్యేక హోదా అనేది ముగిసిపోయిన అంశమే అని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మరోసారి పునరుద్ఘాటించారు. కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉన్నంత మాత్రాన ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యపడదని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. బిహార్‌కి ప్రత్యేక హోదా ఇవ్వాలని ఆ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన తీర్మానంపై కూడా ఆయన స్పందించారు. ప్రత్యేక హోదా ఇవ్వడమనేది తీర్మానాలు చేసి నిర్ణయించే అంశం కాదని తెలిపారు. ప్యాకేజీ నిధుల ద్వారా ఏపీ అభివృద్ధికి కేంద్రం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అని.. దాని నిర్మాణానికి కేంద్రం సహకారం ఉంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాలా? లేదంటే కేంద్రం బాధ్యత తీసుకోవాలా? అనేది కేంద్ర జలవనరుల శాఖ నిర్ణయిస్తుందని చెప్పారు. ఏపీలో శాంతి భద్రతలు కొలిక్కి రావడానికి మరో రెండు మూడు నెలల సమయం పట్టవచ్చని మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. గత పరిస్థితుల కారణంగానే ఈ దాడులు కొనసాగుతున్నాయని చెప్పుకొచ్చారు.

## మరోసారి ఆల్‌టైమ్ రికార్డ్‌లు సృష్టించిన సూచీలు

మొదటిపేజీ తరువాయి..

తాకి 80,074 దగ్గర సరికొత్త రికార్డును నెలకొల్పింది. అలాగే నిఫ్టీ కూడా 24,296 దగ్గర తాజా జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఇక ముగింపులో సెన్సెక్స్ 545 పాయింట్లు లాభపడి 79, 986 దగ్గర ముగియగా.. నిఫ్టీ 162 పాయింట్లు లాభపడి 24, 286 దగ్గర ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.53 దగ్గర ముగిసింది. సెన్సెక్స్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎస్‌బీఐ భారీ లాభాల్లో దూసుకెళ్లగా.. టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా మోటార్స్, టైటాన్ కంపెనీ, ఎల్‌అండ్‌టి నష్టపోయాయి.

## నదుల అనుసంధానంతోనే నీటి సమస్యకు చెక్

మొదటిపేజీ తరువాయి..

యంత్రాలు, మోటార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ఛాయాచిత్ర ప్రదర్శనను మంత్రి పరిశీలించారు.

అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే వృథా నీటిని అరికట్టవచ్చున్నారు. 'ముంపు మండలాలను తెలంగాణ నుంచి ఆంధ్రాకు బదిలీ చేయించడం చంద్రబాబు ముందుచూపునకు నిదర్శనం. పట్టిసీమ ద్వారా ఏటా 80 టీఎంసీల నీటి వినియోగం జరుగుతోంది. గతంలో పట్టిసీమను జగన్ ఒట్టిసీమ అన్నారు.. ఇప్పుడు అదే బంగారమైంది. కృష్ణా డెల్టాకు తాగు, సాగునీరు అందుతుందంటే అది పట్టిసీమ పుణ్యమే. తాగునీటి వ్యవస్థను జగన్ విధ్వంసం చేశారు. పట్టిసీమ నీటిని విడుదల చేయకపోతే లక్షలాది మంది దాహార్తిని ఎలా తీరుస్తారు? ఒక్క చుక్క నీటినీ వృథా చేయొద్దని సీఎం చెప్పారు. తాడిపూడి నుంచి 1.50లక్షల ఎకరాలకు సాగునీరందిస్తున్నాం. ఏలేరు రిజర్వాయర్‌లో నీరుంటే స్టీల్‌ఎ÷-లాంట్, విశాఖకు తాగునీరు అందుతుంది. ఏలేరులో నీటి నిల్వకు ప్రయత్నం చేస్తున్నాం. ఒకే రోజు నాలుగు పథకాల ద్వారా నీటిని విడుదల చేయడం చరిత్ర. అధికారులతో సమన్వయం చేసుకుని నీటి నిర్వహణ సమర్థంగా చేపడుతున్నాం. పోలవరం ఫలాలు పట్టిసీమ ద్వారా కొంతమేర కృష్ణా డెల్టాకు అందుతున్నాయి' అని రామానాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఐటీడీఏ పీవో సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

## నేడు దేశవ్యాప్తంగా స్కూళ్లు, కాలేజీలు బంద్

మొదటిపేజీ తరువాయి..

ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. నీట్, నెట్ మాత్రమే కాదు.. గత కొన్నేళ్లుగా అన్ని పరీక్షల పేపర్ లీకేజీల వల్ల విద్యార్థులు, అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విద్యాశాఖపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. పరీక్షలు వారి జీవితాలకు సంబంధించినవని, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని సూచించారు. మరోవైపు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం జూలై 17న తెలంగాణ ప్రభుత్వం సెలవు ప్రకటించగా.. ఆ రోజు తెలంగాణలోనే కాకుండా ఏపీలో కూడా సెలవు. ప్రభుత్వ మరియు ప్రైవేట్ కార్యాలయాలకు కూడా ఈ సెలవు వర్తిస్తుంది. ఆ రోజు తెలుగు రాష్ట్రాల్లో విద్యాసంస్థలకు సెలవు. అలాగే ఈ నెలలో మరో సెలవు కూడా రాబోతోంది. జులై 27న పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రానున్నాయి. ఎందుకంటే ఆ రోజు తెలంగాణ ప్రభుత్వం బోనాలు పండుగను పురస్కరించుకుని సెలవు ప్రకటించింది. తెలంగాణలోని ప్రధాన పండుగల్లో బోనాలు ఒకటి. 7 జూలై 2024న గోల్కొండ కోటలోని జగదాంబిక అమ్మవారికి మొదటి బోనం సమర్పించి బోనాలు ప్రారంభమవుతాయి. ఈ క్రమంలో జూలై 27వ తేదీని రాష్ట్ర సెలవు దినంగా ప్రకటించారు. ఆ రోజు శనివారం మరియు మరుసటి రోజు జూలై 28 ఆదివారం. ఈ లెక్కన రెండు రోజుల సెలువు రాబోతోంది.

## జగన్ ఐదేళ్ల పాలనలో అమరావతి విధ్వంసం

మొదటిపేజీ తరువాయి..

ఇప్పుడు ప్రజలు, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచుకుంటామన్నారు. అమరావతి అనేది ఆ కాలంలో ప్రముఖ నగరం. రాష్ట్ర విభజన జరుగుతుందని, అమరావతి రాజధాని అవుతుందని ఎవరూ ఊహించలేదు. రాజధానికి అమరావతి పేరు పెట్టాలని రామోజీగ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు సూచించారు. అమరావతి పేరును క్యాబినెట్‌లో వందశాతం అంగీకరించారు. ప్రతి గ్రామం నుంచి మట్టి నీరు తెచ్చి అమరావతిలో ఉంచాం. యమునా నది నీరు, పార్లమెంట్ మట్టిని ప్రధాని మోదీ తెచ్చారు. దేశంలోని ప్రముఖ దేవాలయాల పవిత్ర జలం, మట్టి తెచ్చాం. ఆ పవిత్ర జలం, మట్టి మహిమ అమరావతిలో ఉంది. అందుకే అమరావతిని ఎవరూ కదిలించలేకపోయారు. రాష్ట్రంలో ఎటుచూసినా సమదూరంలో ఉన్న ప్రాంతం ఇది. రాష్ట్ర భవిష్యత్తును ఆకాక్షించే ఎవరైనా అమరావతిని ఒప్పుకోవాలి. విజయవాడ, గుంటూరు మధ్యే రాజధాని ఉండాలని శివరామకృష్ణ కమిటీ కూడా చెప్పింది. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన అనుభవం నాకు ఉంది. తొమ్మిదేళ్లలో సైబరాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేశాం. కృష్ణానది నుంచి నీళ్లు తెచ్చి సైబరాబాద్‌కు ఇచ్చాం. 29 వేల మంది రైతులు 34,400 ఎకరాలు రాజధాని కోసం ఇచ్చారు. రైతులు ఇచ్చిన భూమికి ఏటా పరిహారం ఇచ్చాం. పదేళ్ల వరకు పరిహారం ఇస్తామని రైతులకు చెప్పాం. రైతు కూలీలకు కూడా పరిహారం ఇచ్చాం. రైతులు ఇచ్చింది, ప్రభుత్వ భూమి కలిపి 53,745 ఎకరాలు సమకూరింది. రాజధాని రాష్ట్రానికి నడి మధ్యనే ఉండాలని ఆనాడు ప్రతిపక్షనేతగా జగన్ చెప్పారు. కానీ, అధికారంలోకి వచ్చాక జగన్ ఏం చేశారో ప్రజలే చూశారు. దేశంలో ఏ నగరానికి లేని సౌలభ్యత అమరావతికి ఉంది. ఇన్ని కిలోమీటర్ల రివర్ ఫ్రంట్ ఎక్కడా లేదు. ఒక వైపు గోదావరి, మరో వైపు కృష్ణా రెండు నదుల అనుసంధానంతో ఎప్పుడూ ఫ్రెష్ వాటర్ అందుబాటులో ఉంటుందని అన్నారు. విభజన సమయంలో మనకు లోటు బడ్జెట్‌ఉంది. ప్రాజెక్టు ఏదైనా విన్ విన్ పరిస్థితిలోనే ముందుకు తీసుకెళ్లా. అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక మంది ముందుకొచ్చారు. సింగపూర్.. మనకు మాస్టర్‌ప్లాన్ ఇచ్చింది. తొమ్మిది విభాగాల్లో అమరావతి హబ్‌గా మారాలని ఆకాంక్షించాం. ఫైనాన్షియల్, నాలెడ్జ్, టూరిజం, ఎలక్ట్రానిక్, హెల్త్ సిటీ ప్రతిపాదించాం. పచ్చదనానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాం. దేశంలోని ఏ నగరానికీ అమరావతిలా సౌలభ్యం లేదు. జగన్ వచ్చాక అమరావతిలో జరుగుతున్న పనులను ఆపేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదిక కూల్చేశారు. ఏ కట్టడం కట్టాలన్నా పదిసార్లు ఆలోచిస్తాం. అమరాతి రైతులను అనేక రకాలుగా అవమానించారు. రాజధాని కోసం భూమి ఇచ్చిన రైతులు రోడ్డున పడ్డారు. శ్రీకాకుళం యాత్రకు వెళ్తే మధ్యలోనే అడ్డుకున్నారు. అమరావతి రైతుల త్యాగం చరిత్ర గుర్తు పెట్టుకుంటుందని అన్నారు. అమరావతి విధ్వంసం చేసి తెలుగు జాతికి ద్రోహం చేశారు. రాజధానిని మార్చిన వ్యక్తి గతంలో ఎవరూ లేరు. క్యాపిటల్ మార్పు జరిగితే ఏం జరుగుతుందో దేశానికిది కేస్ స్టడీ. ఇంతగా విధ్వంసం చేసిన వ్యక్తి రాజకీయాలకు అర్హుడేనా? కేసులు ఎదుర్కొంటున్న అమరావతి రైతులకు న్యాయం చేస్తాం. ఏం జరిగినా వెనక్కి చూడను.. ముందుకే వెళ్తా. న్యాయపరమైన చిక్కులు తొలగించి పనులు శరవేగంగా పూర్తి చేస్తాం. ఒకసారి నమ్మకం కోల్పోతే పెట్టుబడిదారులు మళ్లీ రారు.

## జగన్మోహన్ రెడ్డికి భారీ షాక్

మొదటిపేజీ తరువాయి..

కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఎందుకు ఆలస్యమవుతోందని సుప్రీంకోర్టు సీబీఐని ప్రశ్నించింది. నిందితులు వరుసగా వివిధ రకాల పిటిషన్లు వేయడం వల్లనే ఆలస్యం అవుతుందని సీబీఐ తెలిపింది. లోయర్ కోర్టులో వాయిదాలతో తమకు సంబంధం లేదని సీబీఐ తరపు న్యాయవాది న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఇంతకాలం నుంచి ఒక్క డిశ్చార్జ్ పిటిషన్ అన్నా పరిష్కరించారా అని సుప్రీంకోర్టు ధర్మాసనం అప్పట్లో ప్రశ్నించింది. జగన్ క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారని పేర్కొంటూ హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ, ఈడీలు మొత్తం 20 చార్జిషీట్‌లు దాఖలు చేశాయి. ఈ కేసులపై సీబీఐ కోర్టులో గత 12 ఏళ్లుగా విచారణ కొనసాగుతూనే ఉంది. ఆయా చార్జిషీట్ల నుంచి తమను తప్పించాలని కోరుతూ జగన్, విజయసాయిరెడ్డి సహా ఇతర నిందితులు దాఖలు చేసిన 130 డిశ్చార్జి పిటిషన్‌లపై తీర్పు వెల్లడి కాలేదు. తీర్పు చెప్పాల్సిన రోజున జడ్జి బదిలీ అయ్యారు. ఈ కారణంగా మళ్లీ మొదటి నుంచి కేసులను తాజా సీబీఐ కోర్టు జడ్జి వింటున్నారు. తీర్పు వెలువరించాల్సిన సమయంలో బదిలీ కావడంతో ఆయన కేసులను తిరిగి ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. కొత్త జడ్జి మళ్లీ ఈ కేసులను మొదటి నుంచి వినాల్సిన అవసరం ఏర్పడింది. కేవలం డిశ్చారి పిటిషన్‌లకే దశాబ్దకాలం పడితే.. ప్రధాన కేసులు ఎప్పుడు విచారణకు వస్తాయి? ఎప్పుడు శిక్షలు పడతాయి? అన్న అనుమానాలు పిటిషనర్లు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు రోజువారీ విచారణ చేపట్టాలని హైకోర్టు ఆదేశించడంతో డిశ్చార్జి పిటిషన్లపై విచారణ వేగంగా సాగే అవకాశం ఉంది. ఆ తర్వాత చార్జిషీట్లపై ట్రయల్ ప్రారంభమవుతుందని న్యాయవర్గాలు చెబుతున్నాయి.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# మార్పు మొదలైంది

## బుర్రాది రాజకీయ వ్యాపారం
## ఉగ్రది ప్రజా సేవ అంటున్న కనిగిరి ప్రజలు
## వడివడిగా అభివృద్ధి కార్యక్రమాలు



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 3)**
కనిగిరిలో మార్పు మొదలైంది. కనిగిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రం కొన్ని దశాబ్దాలుగా ప్రజలు ట్రాఫిక్‌తో అల్లాడుతున్నారు. బుధవారం పట్టణంలోని ప్రధాన వీధుల్లో రోడ్డు ఆక్రమణ గురించి పట్టించుకున్న పాలకులే లేరు. కనిగిరికి వచ్చే ప్రజలతో పాటు, పట్టణ ప్రజలు ట్రాఫిక్‌తో సతమతమవుతున్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో డాక్టర్ ఉగ్ర ఓవీ రోడ్డులోని రజకవీధి మలుపు వెడల్పు చేసి ప్రమాదాలు నివారించారు. ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే డాక్టర్ ఉగ్ర ట్రాఫిక్ సమస్యపై దృష్టి పెట్టారు. పట్టణంలోని పామూరు రోడ్డు, ఓవీ రోడ్డు, చెప్పుల బజార్‌లో రోడ్డు ఆక్రమణలను బుధవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో వందలాది మంది పోలీసు బందోబస్తుతో ఆక్రమణలు తొలగించారు. రోడ్ల ఆక్రమణలు తొలగించడంతో రోడ్లు విశాలంగా కనిపించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే చిరు వ్యాపారులు మాత్రం అసంతృప్తికి గురయ్యారు. రోడ్లు పక్కనే ఉన్న బంకులను కొందరు ఏర్పాటు చేసుకుని, అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. పేరున్న ప్రముఖుల సైతం ఈ ఆక్రమణలో ఉండటం గమనార్హం. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీరుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన రోడ్లలో కూడా ఆక్రమణలు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ప్రధాన రోడ్లలో డివైడర్‌లను ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.




**బుర్రాది రాజకీయ వ్యాపారమేనా..!**
వైసీపీ పాలనలో ఎమ్మెల్యేగా పనిచేసిన బుర్రా మధుసూదన్ యాదవ్‌ది రాజకీయ వ్యాపారమేనని కనిగిరి ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎన్నికల్లో ఖర్చు పెట్టిన డబ్బును సంపాదించుకునేందుకే ఆయన ఐదేళ్ల పాలన సాగింది. మట్టిరోడ్లుతో పాటు పనులు చేయకుండానే బిల్లులు చేసుకోవడం, వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం, రియల్ ఎస్టేట్‌లో అందినకాడికి దండుకోవడమే బుర్రా చేసిన పని అని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు. ప్రభుత్వ భూములలో ఆయన ముఖ్య అనుచరుల ద్వారా వెంచర్‌లు వేయించి కోట్ల రూపాయలు స్వాహా చేయించారు. ఉపాధి హామీ పథకంలో సిఎస్‌పురం మండలంలో రోడ్లు వేయకుండా బిల్లులు చేసుకోవడంతో ఆ పనులపై వైసీపీ నాయకులే ఫిర్యాదు చేయడంతో విచారణ కూడా జరిగింది. కనిగిరిలో వివాదాస్పద భూములు తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక రేట్లకు ఫ్లాట్లు బలవంతంగా వ్యాపారులకు అంటకట్టారు. ఆ వెంచర్‌లు అపార్ట్‌మెంట్‌లు నిర్మిస్తున్నట్లు శంకుస్థాపనలు చేసి కొనుగోలు దారులను మరింత మోసం చేశారు. బుర్రా హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ఏడుకోట్ల అవినీతికి పాల్పడ్డారు. అయితే ఆ కాలనీకి మట్టిరోడ్డు కూడా వేయలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. బుర్రా రాజకీయాన్ని వ్యాపారం చేయడం వలనే కందుకూరు పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వైసీపీ నాయకులే బాహాటంగా విమర్శిస్తున్నారు.

**ఎమ్మెల్యే ఉగ్రకు ప్రశంసల జల్లు :** ట్రాఫిక్ పై దృష్టి పెట్టడంతో పాటు ఎంఆర్వో కార్యాలయ ప్రాంగణంలో రైతు బజారు నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి. మోడల్ స్కూల్‌కు గ్రావెల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. త్వరలో తారు రోడ్డు నిర్మాణం జరిపిస్తామని హామీ ఇచ్చారు. హైవే రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూములు కోల్పోయిన రైతులుకు యుద్ధప్రాతిపదికన నిధులు విడుదల చేయించారు. హైవే రోడ్డు నిర్మాణం కూడా వీలైనంత త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నెల రోజుల వ్యవధిలోనే అభివృద్ధి మార్పు చూపించిన ఎమ్మెల్యే ఉగ్రకు కనిగిరి ప్రజలు ప్రశంసిస్తున్నారు.

**వీధి వ్యాపారుల పక్షాన న్యాయ పోరాటం చేస్తాం**
**వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్**
గత నలభై ఏళ్లుగా అనేక మంది పేదలు చెప్పుల బజార్, పామూరు బస్టాండ్‌లో సెంటర్‌లతో వీధి వ్యాపారులు జీవిస్తున్నారు. అనేక మంది పాలకులు మారినా వీధి వ్యాపారులను ఇబ్బంది పెట్టలేదు. కనిగిరి పట్టణంలో ఇప్పటికే మంజూరులో ఉన్న బైపాస్ రోడ్డును నిర్మిస్తే పట్టణ ట్రాఫిక్ సమస్య పరిష్కరించవచ్చు. ఆ దిశగా ఆలోచించి చర్యలు తీసుకువాల్సింది. కానీ కమిషనర్ కేవలం అధికార పార్టీ నేతల ఆదేశానుసారం దుందుడుకుగా (తరువాయి 4లో...)

# ఉపాధి హామీ చట్టం కింద చేపట్టే పనుల్లో నాణ్యత, సత్వరం పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 3)**
ఉపాధి హామీ చట్టం క్రింద చేపట్టే పనులలో నాణ్యత, సత్వరం పూర్తిచేయుట ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా చెప్పారు. బుధవారం ఆమె జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులతో ప్రకాశం భవనంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. డ్వామా ఆధ్వర్యంలో వ్యవసాయ – అనుబంధ శాఖల ద్వారా చేపడుతున్న పనులపై ఆమె ఆరా తీశారు. జిల్లాలోని కూలీలకు లభిస్తున్న రోజువారీ వేతనం, రాష్ట్ర స్థాయిలో లభిస్తున్న రోజువారీ సగటు వేతనం, జిల్లాలో కల్పిస్తున్న పని దినాల సంఖ్య, రాష్ట్ర స్థాయిలో సగటు పని దినాల సంఖ్య తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ విషయాలలో రాష్ట్ర సగటు కంటే, జిల్లా సగటు మెరుగ్గా ఉండేలా పనిచేయాలని స్పష్టం చేశారు. కేవలం పూడికతీత పనులకే పరిమితంకాకుండా స్థానిక అవసరాలను గుర్తించి ఉపాధి పనులు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే చేపట్టిన వ్యవసాయ అనుబంధ పనులను – పూర్తి చేసేందుకు గడువును (తరువాయి 4లో...)



# జగన్‌ను కలిసిన చింతలచెరువు



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 3)**
వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వైసీపీ రాష్ట్ర నాయకులు చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి బుధవారం తాడేపల్లిలో కలిసారు. ఎన్నికల అనంతరం మొదటిసారిగా చింతలచెరువు జగన్‌ను కలిసారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో జరిగిన పరిస్థితులపై జగన్‌తో చర్చించారు. ప్రకాశం జిల్లాతో పాటు పలు జిల్లాల్లో పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపినట్లు తెలుస్తోంది. పార్టీకి పూర్వవైభవం తెచ్చి రాష్ట్రంలో 2029లో జగన్ పాలన తెచ్చే వరకు తాము పోరాటం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జగన్ చింతలచెరువుతో పాటు నాయకులకు దిశ, నిర్దేశం చేశారు. టీడీపీ చేపట్టే ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను సమర్ధంగా ఎదుర్కొనేందుకు చర్యలను మాజీ సీఎం వివరించినట్లు తెలుస్తోంది. మాజీ సీఎం జగన్‌ను కలిసిన వారిలో వైసీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ రవీంద్రరెడ్డి, జిల్లా వైసీపీ నేత కృష్ణారెడ్డి జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.







# కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే దామచర్ల

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 3)**
ఒంగోలు నగరంలోని కలెక్టర్ కార్యాలయం నందు ప్రకాశం జిల్లా నూతన కలెక్టర్ తమీమ్ అన్సారీయాని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మర్యాదకపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఒంగోలు నియోజకవర్గంలోని సమస్యలపై కలెక్టర్‌తో చర్చించారు.

# ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి

## రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి

**(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జులై 3)**
ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి చెప్పారు. బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్థనరావుతో కలిసి స్థానిక భాగ్యనగర్‌లోని బధిరుల పాఠశాలను, సాంఘిక సంక్షేమ శాఖ బాలికల హాస్టల్ను సందర్శించారు. అక్కడి పరిసరాలు, పరిస్థితిని, రికార్డులను, తాగునీటి సదుపాయం, వంట గదిని, టాయిలెట్స్‌ను పరిశీలించారు. బాలికలతో ప్రత్యేకంగా మాట్లాడి వారికి





లభిస్తున్న సదుపాయాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బధిరుల పాఠశాలలో విద్యార్థులు బాత్రూము వెళ్లినప్పుడు ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే తెలియజేసేలా ఒక ఎమర్జెన్సీ బెల్లును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బాలికల హాస్టల్లో అదనపు టాయిలెట్స్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, హాస్టల్కు అవసరమైన నీటి వసతి కల్పిస్తామని, ఈ ప్రాంగణంలోని చిల్లచెట్లను తొలగించి డ్రైనేజి వ్యవస్థను సరిచేస్తామని, ప్రాంగణంలో విద్యుత్ సౌకర్యాన్ని మెరుగుపరుస్తామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ఎస్సీ, ఎస్టీ, బిసి హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. (తరువాయి 4లో...)

# మార్పు మొదలైంది











వ్యవహరించడం సరైంది కాదు. వీధి బంకుల వ్యాపారులకు కనీసం సమాచారం ఇవ్వకుండా, ప్రత్యామ్నాయం చూపకుండా బంకులను తొలగించి వందలాది కుటుంబాలను వీధిన పడేశారు. భారీ పోలీస్ బలగాలతో పేదల పై ఒక్క సారిగా అధికారదమన కాండ సృష్టించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. కమిషనర్ నిబంధనలను తొంగలో తొక్కి ఇష్టాను రీతిగా వ్యహరించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కలెక్టర్, ఉన్నతాధికారులను కలిసి వీధి వ్యాపారులకు న్యాయం జరిగే విధంగా న్యాయ పోరాటం చేస్తా.

## ఉపాధి హామీ చట్టం కింద చేపట్టే పనుల్లో నాణ్యత, సత్వరం పూర్తి చేయాలి



నిర్దేశించుకోవాల్సి ఉన్నదన్నారు. అనుమతి లభించినా ఇప్పటికీ ప్రారంభించని పనులను సత్వరమే ప్రారంభించాలన్నారు. క్షేత్ర స్థాయిలో అనుమతిస్తూ తీర్మానాలు చేసిన పనుల ప్రతిపాదనలను తుది ఆమోదం కోసం తనకు పంపాలని ఆదేశించారు. ఉపాధి కూలీల సంఖ్య పెరిగేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డ్వామా పిడి అర్జునరావు, అదనపు పిడి (వాటర్ షెడ్) వండర్ మెన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి గోపీచంద్, ఏపిఎంఐపి పిడి పివి రమణ, జిల్లా సెరీకల్చర్ అధికారి సుజయ్కుమార్, డ్వామా ఏపిడిలు, ఏపిఓలు, ఈసిలు, వాటర్ షెడ్ పిఓలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి





యువతకు నాణ్యమైన విద్యతోపాటు వారిలో నైపుణ్యాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. డిఎస్సికి సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కూడా ఇస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమశాఖ మంత్రి ఆదేశాల మేరకు బధిరుల పాఠశాలతో





పాటు జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన విద్య, మంచి భోజనం అందించేలా పర్యవేక్షణ మరింత పెంచుతామని చెప్పారు. హాస్టళ్లను తరచూ తనిఖీ చేస్తామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే విద్యార్థులు తన దృష్టికి తీసుకువచ్చేలా ఫిర్యాదుల బాక్సు కూడా హాస్టల్లో ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ బాలికల హాస్టల్ ప్రాంగణంలోని చిల్లచెట్లన్నింటినీ తక్షణమే తొలగించాలని, మురుగునీరు పారేలా డ్రైనేజి సదుపాయం కల్పించాలని, నీటి సమస్యని తొలిగించేలా అదనపు సంపు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్తో మాట్లాడానన్నారు. పేద విద్యార్థులకు విద్యతోపాటు మెరుగైన వసతులు కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ప్రాంగణంలో అవసరమైతే పైన మరో అంతస్థును నిర్మిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా వారి వెంట జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మా నాయక్, దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి. అర్చన, ఒంగోలు ఆర్‌డిఓ జివి సుబ్బారెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

## ప్రకృతికి సవాల్‌గా మారిన ప్లాస్టిక్ ను నిర్మూలించాలి

### ప్లాస్టిక్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పర్యావరణ సంస్థ పిలుపు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 3)**

ప్రకృతికి, పర్యావరణానికి సవాల్‌గా మారిన ప్లాస్టిక్ ను నివారించడంలో, నిర్మూలించడంలో ప్రభుత్వాలు, ప్రజలూ ప్రతిన పూనాలని పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ జి వీరభద్రాచారి పిలుపు నిచ్చారు. జులై మూడు ప్రపంచ ప్లాస్టిక్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవుడి నిత్య జీవనంలో భాగంగా మారిన పరిస్థితుల్లో నిత్యం ఒక వ్యక్తి శరీరంలోకి పది గ్రాముల మైక్రో ప్లాస్టిక్, ప్రతి ఏటా మానవుల శరీరంలోకి 18 లక్షల మైక్రో ప్లాస్టిక్ కణాలు చేరుకుంటున్నట్లు పరిశోధకులు వెల్లడిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ డబ్బాలలో, సంచులలో నిల్వ ఉంచిన ఆహారం, మంచినీరు లాంటి వాడకాన్ని ప్రజలు నివారించాలని కోరారు. ప్లాస్టిక్ వాడకం ద్వారా క్యాన్సర్ లాంటి మహమ్మారి నేడు విస్తరించి ప్రజల ప్రాణాలను హరిస్తుందన్నారు. ప్లాస్టిక్ నివారణలో ప్రభుత్వాలు వైఫల్యం ప్రజల ప్రాణాలకు, ప్రకృతికి పెనుముప్పుగా మారిందని,ప్రజల చైతన్యమే నిజమైన నివారణ చర్యగా వీరభద్రాచారి అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సంస్థ సభ్యులు అమన్, అజయ్ భువన, అనూరాధ, లోక నాదం, ద్వారక, గురునాథం, రమేష్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 3, 4, 5 తరగతుల మెర్జింగ్ రద్దుచేసి ప్రాథమిక విద్య వ్యవస్థను కాపాడాలి

**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 3)**

దొరవారిసత్రం మండలంలోని ఏకొల్లు, పూలతోట కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో బిటిఏ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన బి,టి,ఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి.రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 117 అని రద్దుచేసి 3,4,5 తరగతులను ప్రైమరీ పాఠశాలలో కలిపి ప్రాథమిక విద్య వ్యవస్థను కాపాడాలని కోరారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మండలంలోని పాఠశాలలన్నీ సందర్శించి ఉపాధ్యాయుల నుంచి సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా బీటీఏ రాష్ట్ర కార్యదర్శి కె.మునిస్వామి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో బహుజన టీచర్స్ అసోసియేషన్ సమర్థవంతంగా పనిచేస్తుందని, ఉపాధ్యాయ హక్కుల సాధనకు ముందు ఉంటుందని ,సంఘాన్ని ఉపాధ్యాయులు అందరూ బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. తర్వాత బి, టి,ఎ,జిల్లా నాయకులు శేషయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారులను కలిసి మండలంలోని సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.రవి,జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసులు, బిటిఏ దొరవారిసత్రం ప్రధానకార్యదర్శి టి.నాగరాజు,మండల కోశాధికారి వినయ్ కుమార్, మండల నాయకులు దొరబాబు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



## నాగేంద్రబాబును కలిసిన డాక్టర్ పాకనాటి గౌతమ్ రాజ్



**(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, జులై 3)**

జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగేంద్ర బాబును యర్రగొండపాలెం నియోజవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ పాకనాటి గౌతమ్ రాజ్ కలిశారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పెద్ద దోర్నాల మండలంలో నీటి సమస్య ఎక్కువగా ఉందని దోర్నాల జనసేన పార్టీ నాయకులు గౌతమ్ రాజ్‌కు తెలపడంతో డాక్టర్ గౌతమ్ రాజ్ దోర్నాలలో నీటి సమస్యను గమనించి బుధవారం నాడు జనసేన పార్టీ కార్యాలయంలో కొణిదెల నాగేంద్రబాబుకు వినతి పత్రం అందించారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగేంద్ర బాబు ప్రకాశం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి వాటర్ సమస్య యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో నీటి సమస్య ఎక్కువగా ఉందని తెలపడంతో జిల్లా కలెక్టర్ త్వరలో నీటి సమస్యను కొరత లేకుండా చేస్తానని తెలిపినట్టు యర్రగొండపాలెం నియోజవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ పాకనాటి గౌతమ్ రాజ్ తెలిపారు.

## లూజు విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

### డిడిఏ రామ్ మోహన్



**(షణ్ముఖ వెలుగు, అర్ధవీడు, జులై 3)**

లూజు విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం డిడిఏ ఎస్.రామ్ మోహన్హెచ్చరించారు. బుధవారం మండలంలోని అర్ధవీడు , పాపనేనిపల్లె విత్తన దుకాణాలలో జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం డిడిఏ ఎస్. రామ్ మోహన్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. దుకాణాల్లోని రికార్డులను, స్టాకులను పరిశీలించారు. లూజు (విడి) విత్తనాలను రైతులకు అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యజమానులు ఎప్పటికప్పుడు వారి వద్ద ఉన్నా ఎరువులు, విత్తనాల వివరాలను రేట్లను చూపించే స్టాక్ బోర్డు నిర్వాహణ సక్రమంగా ఉండాలన్నారు. ప్రభుత్వ అనుమతి కలిగిన నాణ్యమైన విత్తనాలను, ఎరువులను రైతులకు విక్రయించాలన్నారు. విక్రయాల వివరాలను రికార్డులో పొందుపరిచి ఆ రైతులకు రశీదులు ఇవ్వాలన్నారు. ఈ తనిఖీలలో మార్కాపురం ఏడిఏ డి.బాలాజీనాయక్, ఏవో షేక్ మహమ్మద్‌లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కన్నాను పరామర్శించిన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి





**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జులై 3)**

ఇటీవల కుడి చేతికి శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి బుధవారం పరామర్శించారు, గుంటూరులోని కన్నా నివాసానికి చేరుకుని ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి మాజీ మంత్రి కన్నాను అడిగి తెలుసుకున్నారు.

## కోటపోలూరు జెడ్పీ హైస్కూల్లో స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇన్‌చార్జి, జులై 3)**
విద్యార్థినీ, విద్యార్థులు భవిష్యత్తులో మంచి చదువులు చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, అందుకు పునాది పదో తరగతి అని, పదో తరగతిలో ఎటువంటి ఇబ్బంది పడకూడదని, తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం కోటపోలూరు జెడ్పీ హైస్కూల్లో బుధవారం టీడీపీ, జనసేన, బిజెపి నాయకులు పదో తరగతి విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ రూరల్ వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలంటే పదో తరగతి నుంచే చదువుపై శ్రద్ధ చూపించి వెను తిరిగి చూసుకోకుండా ముందుకు వెళ్లాలని, మంచి మంచి ఉద్యోగాలు తెచ్చుకొని మీరే పదిమందికి దారి చూపే విధంగా మెలగాలని తెలిపారు. పదో తరగతి పరీక్ష ఫలితాలలో స్కూల్ ఫస్ట్ వచ్చిన విద్యార్థికి10,000 ఆర్థిక సాయం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు అరణి విజయ భాస్కర్ రెడ్డి, కోటపోలూరు జనసేన నాయకులు వల్లూరు రాజ, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది, స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

## ఆబాక సచివాలయంలో గ్రామసభ

### పంచాయతీల్లో సమస్యల పరిష్కారానికై సమీక్ష



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇన్‌చార్జి, జులై 3)**
తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం ఆబాక సచివాలయంలో బుధవారం సచివాలయ ఇన్చార్జ్ పద్మ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో ఆబాక, సామంతమల్లాం, మన్నెముతేరి, గ్రామ సర్పంచులు ఆధ్వర్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్య, పలు విధములైన సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూడు పంచాయతీల సర్పంచులు యద్దల రాజ, తుమ్మ శారద, మన్నే ముతేరి మాజీ సర్పంచ్ చెంగయ్య, తెలుగుదేశం నాయకులు పాకం వెంకటసుబ్బయ్య, జనార్ధన్, జనసేన నాయకులు నక్కా హరిబాబు, తుమ్మ రంజిత్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇన్‌ఛార్జి, జులై 3)**
తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం బొందలపాలెం గ్రామంలో 10 కుక్కలు ఒక వ్యక్తిపై దాడి చేశాయి. ఈ దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల ప్రజలు కుక్కలను అరుస్తున్న సరే అతనిని విడిచిపెట్టలేదు. బందలపాలెం గ్రామంలో మరీ ఎక్కువగా ఉందని గ్రామస్తులు తెలిపారు.

## రేపటి నుంచి ఏపీలో సదరం స్లాట్ బుకింగ్

**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇన్‌ఛార్జి, జులై 3)**
వైకల్య ధ్రువీకరణ పత్రాల కోసం నిర్వహించే సదరం స్లాట్ బుకింగ్ శిబిరాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. జులై నుంచి సెప్టెంబర్ వరకు వైకల్య నిర్ధారణ పరీక్షలు జరుగుతాయని తెలిపింది. దీనికోసం మీసేవా, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ముందస్తు స్లాట్లను బుక్ చేసుకోవచ్చని పేర్కొంది.



# భారత న్యాయ వ్యవస్థలో కొత్త అధ్యాయం

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 3)**
బిట్స్ కాలేజీలో భారతీయ న్యాయవ్యవస్థలో కొత్త అధ్యాయం మీద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కాలేజీ ఎండీ బెల్లంకొండ విజయలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం బ్రిటిష్ వలస పాలన నుండి ఇప్పటి వరకు కొనసాగుతున్న న్యాయ చట్టాలు కనుమరుగైనవని, దేశీయ పేర్లతో ఈ నెల 1వ తేదీ ఆదివారం అర్ధరాత్రి (తెల్లవారితే సోమవారం) నుంచి కొత్తగా మన దేశంలో "మూడు" కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయన్నారు. స్వాతంత్ర్యము వచ్చి దాదాపు 70 ఏళ్ల తర్వాత క్రొత్తగా దేశీయ న్యాయ చట్టాలు వచ్చాయన్నారు. ఇప్పటి నుంచి ప్రస్తుతం బ్రిటిష్ కాలం నాటి నుంచి అమలవుతున్న చట్టాలు కాలగర్భంలో కలిసిపోయినాయన్నారు. గత ఎడాది పార్లమెంట్ ఆమోదం పొందిన 1) ఐపీసీ - స్థానంలో బిఎన్ఎస్, 2) సీఆర్‌పీసీ స్థానంలో బిఎన్ఎస్ఎస్, 3) ఐఈఏ స్థానంలో - బిఎస్ఏ మార్పులతో ఈ మూడు కొత్త చట్టాలు 2024 జూన్ 30 ఆదివారం అర్ధరాత్రి తెల్లవారితే... 2024 జూలై 1 సోమవారం నాటి నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తరువాత మొట్టమొదటి తొలి కేసు ఢిల్లీ పోలీస్ స్టేషన్లోలో సెక్షన్ 285 కింద తొలి కేసు నమోదయిందన్నారు. తెలంగాణా రాష్ట్రంలో హైదరాబాద్‌లో చార్మినార్ దగ్గర ఒక కేసు నమోదయిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మార్కాపురంలో వేములకోట గ్రామంలో 103 క్లాస్ 1 కింద హత్య కేసుగా నమోదై ఏపీలో తొలి కేసుగా రికార్డుకి ఎక్కటం గమనార్హం అన్నారు. అమలులోకి వచ్చిన మూడు క్రొత్త చట్టాలపై మాట్లాడుతూ...బీఎన్ఎస్-భారతీయ న్యాయ సంహిత న్యాయ చట్ట ప్రకారము క్రిమినల్ కేసుల్లో విచారణ పూర్తయిన 45 రోజుల్లోగా తీర్పు వెలువడి... తొలి విచారణ జరిగిన 60 రోజుల్లోపు చార్జ్ షీటు నమోదు చేయాలి... వ్యవస్థీకృత నేరాలు ఉగ్ర చర్యలపై కొత్త చట్టాల స్పష్టత ఇచ్చారన్నారు. ఇంకా ఈ చట్టం ప్రకారం "రాజా ద్రోహం" అనే పదము తొలగింపుచేశారు. ఎవరైనా చిన్నారులపై సామూహిక అత్యాచారాలు పాల్పడితే మరణశిక్ష లేదా యావజ్జీవ కారాగార శిక్ష విధింపు, కొంతమంది పెళ్లి చేసుకుంటాను అని మోసం చేయడం, చిన్నారులపై ముఖాలపై యాసిడ్ తదితర దాడులు, చిన్నారులపై సామూహిక అత్యాచారం, పెళ్లి చేసుకుంటాను అని తప్పుడు వాగ్దానాలు చేసి శారీరక సంబంధాలు పెట్టుకుని మహిళను వదిలివేయటం, ఇలాంటి నేరాలకు కొత్త కేసులు నిబంధనలు కొత్త చట్టంలో కఠిన తరం చేశారని ఆమె తెలిపారు. భారతీయ శిక్షా స్మృతి ప్రకారం ఐపీసీలో 511 సెక్షన్స్ ఉంటే..బీఎన్ఎస్(భారతీయ న్యాయ సంహితలో )లో 358కి కుదింపు చేశారు. ఒక సెక్షన్ కిందకు ఐపీసీలో 6 నుండి 52 సెక్షన్స్ మధ్య ఉన్న పలు నిర్వచనాలు ఒకే సెక్షన్ కిందకు తెచ్చారు. 18 సెక్షన్స్ ఇప్పటికే రద్దు చేశారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలు శిక్షలకు ప్రాధాన్యమిస్తే... నేడు కేంద్ర ప్రభుత్వము న్యాయానికి పెద్ద పీఠం వేశారు అని శ్రీమతి విజయలక్ష్మి గారు పేర్కొన్నారు. సెక్రటరీ , కరెస్పాండంట్ డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు ప్రసంగిస్తూ... బ్రిటీష్ వారు ఆనాటి చట్టాలతో 1908 సంవత్సరంలో స్వాతంత్ర్య సమరయోధుడు అతివాధ కాంగ్రెస్ నాయకుడు బాలగంగాధర తిలక్‌పై రాజద్రోహం కేసు నమోదు చేసి మాండలే జైలుకు పంపించారని, మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2022 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వము మాజీ ఎంపీ రఘురామ కృష్ణంరాజుపై దేశ ద్రోహం కేసు నమోదు చేసి చట్టాన్ని దుర్వినియోగం చేశారన్నారు. ఇలాంటి బ్రిటిష్ పాత చట్టాలు అడ్డుపెట్టుకొని ప్రభుత్వాలు ప్రతి పక్ష నాయకులపై కేసులు పెట్టి దుర్వినియోగం చేసిన అనేక సంఘటనలు ఉదహరించారు. కేంద్రం ఈ మూడు దేశీయ చట్టాలు తెచ్చి అమలు చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. బిట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నారపుశెట్టి నాయుడు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో బీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్ తోట శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 3)**
జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సరియాను ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలిసి బొకే అందజేసి శు భాకాంక్షలు తెలియజేశారు. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో గత 30 సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ ప్రజల పక్షాన నిలబడుతున్నామని ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల పక్షాన కలుస్తామని సహకరించాలని జిల్లా కలెక్టర్ గారిని కోరారు,ఆరోగ్యశ్రీ పథకం వికలాంగులు పింఛన్ విషయంలో పోరాటం చేసి 3000 వేలు నుండి 6000 పెంచిన ఘనత కృష్ణ మాదిగ దేనాని కలెక్టర్ గారికి వివరించారు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఎం జె ఎఫ్ నాయకులు తప్పకుండా తమవంతులో భాగంగా ప్రజా సమస్యలకు పరిష్కార మార్గం చూపుతానని కలెక్టర్ ఎమ్మార్పీఎస్ నాయకులకు హామీ ఇచ్చారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు తొరటి ఆనంద మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు నేలపాటి రాజు మాదిగ, ఒంగోలు నియోజకవర్గ ఎమ్మార్పీ, ఎంఎస్పి ఇన్‌ఛార్జి తిరివిది బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు నర్సింగరావు మాదిగ, ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు వర్ల దేవదాసు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదిమల ప్రకాష్ మాదిగ, జిల్లా మాదిగ జర్నలిస్టు ఫారం అధ్యక్షులు గురిజాల బాబురావు మాదిగ, కనిగిరి నియోజకవర్గ ఎంఎస్పి ఇన్‌ఛార్జి రావినూతల కోటయ్య మాదిగ, కాంతారావు మాదిగ, మర్రిపూడి, పొదిలి, సింగరాయకొండ మండలాల ఎంఆర్పిఎస్ అధ్యక్షులు బసవయ్య మాదిగ, సురేష్ మాదిగ, మెత్తల రాజా మాదిగ, కాకుమాను సుబ్బారావు మాదిగ, కిరణ్ మాదిగ, బద్దిపూడి హెడ్‌వడ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



## నేడు వెంకటగిరిలో దివ్యాంగుల ఆధ్వర్యంలో చంద్రబాబు, పవన్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం

**(షణ్ముఖ వెలుగు, వెంకటగిరి ఇన్‌ఛార్జి, జులై 3)**
తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం లో దివ్యాంగుల పింఛన్లు పెంచడంపై పిడబ్ల్యుడి ఫెడరేషన్ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈక్రమంలో వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ గ్రౌండ్లో గురువారం అభినందన సభ నిర్వహించనున్నారు. దివ్యాంగుల ఆధ్వర్యంలో చంద్రబాబు, పవన్, స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం చేయనున్నట్లు పిడబ్ల్యుడి ఫెడరేషన్ సభ్యులు తెలిపారు.

## ఇసుక రక్షణకు చేతులెత్తేసిన రెవెన్యూ సిబ్బంది



**(షణ్ముఖ వెలుగు, మర్రిపాడు, జులై 3)**
రాష్ట్రంలో ఇసుక ఉచితంగా అందించే నూతన పాలసీని సిద్ధం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చి ఉండగా, నెల్లూరు జిల్లా మర్రిపాడు మండల కేంద్రంలోని లక్ష 70,400 క్యూబిక్ మీటర్ల ఇసుక డంపును రక్షణగా 11 మంది వీఆర్వోలు 40 మంది వీఆర్ఏలతో రక్షణ కవచం ఏర్పాటు చేసి కాపాడుతున్నారు. అయితే ఏమైందో ఏమో ఒక్కసారిగా ఇది తమ వల్ల కాదంటూ మైన్స్ వాళ్లే చూసుకోవాలటూ ఇసుక డంపు వద్ద ఉన్న రెవెన్యూ సిబ్బందిని కాపల నుంచి పక్కకు అధికారులు తప్పించారు. దీంతో ఇసుక అక్రమ రవాణాకు తెరలేచి రెండు రోజులుగా అక్కడ ఉండే ఇసుక డంపు నుంచి అనధికారికంగా ఇసుక తరలి వెళ్తూ ఉంది.

# పుట్టుకతో వచ్చే లోపాలపై వైద్యాధికారులకు శిక్షణ

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 3)

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సురేష్ కుమార్ ఆదేశాల మేరకు డాక్టర్ భగీరథి యన్‌సిడి ప్రోగ్రాం అధికారి ఆధ్వర్యంలో జిజిహెచ్ మెడికల్ కాలేజీ కాన్ఫరెన్స్ హాల్లో ఒంగోలు నందు, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ వారి ఆదేశాల మేరకు రెండవ బ్యాచ్‌లో సెకండ్ మెడికల్ ఆఫీసర్లకు, స్టాఫ్ నర్స్‌లకు రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా పుట్టుకతో వచ్చు లోపాలపై మూడు రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో ముఖ్యంగా పిల్లలలో పుట్టుకతో వచ్చే లోపాలు గుర్తించుట తల నుంచి పాదం వరకు చేసే పరీక్ష విధానం అప్పుడే పుట్టిన నవజాత శిశువు వయసు నుంచి అంగన్వాడి, కాలేజీ విద్యార్థుల వరకు వైద్య పరీక్షలు నిర్వహించి పుట్టుకతో వచ్చే లోపాలను పోషకాహార పెరుగుదల లోపాలు, జన్యుపరమైన లోపాలు, వైకల్యాలు, బరువు తక్కువ గల పిల్లలు, నెలలు నిండక ముందే పుట్టిన పిల్లలు, మెల్ల కన్ను, గ్రహణ మొర్రి, వంకర పాదాలు ,కంటి శుక్లాలు, వినికిడి లోకం, గుండె సంబంధిత వ్యాధులు వివిధ రకాల అంటు వ్యాధులను గుర్తించి సత్వర చికిత్స అందించుట ముఖ్య లక్షణంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో చికిత్స చేయలేని వారికి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని త్వరిత చికిత్స కేంద్రానికి లేదా ఓపి కేంద్రానికి రెఫర్ చేయాలని






తెలిపారు. తదుపరి త్వరిత చికిత్స కేంద్రంలో స్క్రీనింగ్ నిర్వహించి తగువిధంగా చికిత్సలు ఫిజియోథెరపీ రిహాబిలిటేషన్ మొదలగు సర్వీసులను అందిస్తున్నామన్నారు. తదుపరి శస్త్ర చికిత్సల అవసరమైన పిల్లలకి ఉచితంగా ఆపరేషన్లు చేయించబడుతుందన్నారు. అందులో వినికిడి లోపం, మెల్లకన్ను, కంటి రెటీనా పెదవి, నోరు, గుండె పనితీరు లో లోపం వంటి పిల్లలకు దాదాపు 8 నుంచి 10 లక్షల రూపాయల వరకు ఉచితంగా చికిత్స అందించబడుతుంది. అలాగే వినికిడి లోపం గల పిల్లలకి వినికిడి పరికరాలు ఉచితంగా అందించబడును. డిఈ ఐసి నందు పై వ్యాధులకు ప్రత్యేకమైన థెరపిస్టులు చికిత్సలు, రిహాబిలిటేషన్ అందిస్తారు. అలాగే ప్రతి ఫెసిలిటీలో అడాలసెంట్ బాల, బాలికల కోసం ప్రత్యేక స్నేహపూరిత క్లినిక్‌ను నిర్వహించాలని, బడి బయట ఉన్న




కౌమార బాలికలకు అనీమియా వ్యాధి హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహించి అవసరమైన వారికి ఇంటి వద్దనే నీలం రంగు ఐరన్ టాబ్లెట్లు నెలకు సరిపడా ఇవ్వాలని, నెలకు ఒక్కసారైనా విద్యాధికారి తన పరిధిలోని విద్యాలయాల్లో మెడికల్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించాలని, అలాగే అన్ని అంగన్వాడి, ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు మెడికల్ స్క్రీనింగ్ నిర్వహించాలని తెలిపారు. సమగ్ర నవజాత శిశువులను స్క్రీనింగ్ చేసే విధానంపై వైద్య సిబ్బందికి మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ కార్యక్రములో డాక్టర్ శ్రీచందు ఈ కార్యక్రమానికి శిక్షణ నిపుణుడు, చిన్న పిల్లల వైద్య నిపుణుడు, ఆర్‌బిఎస్‌కె సిబ్బంది, మొదలగు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఒంగోలు అభివృద్ధిలో తోడ్పాటు అందించాలి

## ఎమ్మెల్యే దామచర్ల







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 3)

ఒంగోలు నగరంలోని అష్టోనా ఫంక్షన్ హాల్ నందు టీడీపీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జి, జనసేన నాయకులు, బీజేపీ నాయకులతో ఏర్పాటు చేసిన విస్తృతస్తాయి సమావేశం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ మీ అందరూ కష్టపడి ఒంగోలు నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో నన్ను గెలిపించినందుకు మీ అందరకి పేరుపేరున నా కృత్ఞతలు తెలిపారు. గతంలో మాదిరి కాకుండా ఈసారి మీ అందరని ఆర్థికంగా, సామజికంగా అభివృద్ధి చేయడం నా భాధ్యత అన్నారు. ప్రజలకు ఏమి కావాలో ప్రతి ఒక్కరు బూత్ స్థాయిలో మీ అందర దగ్గిర పూర్తి వివరాలతో వుంచుకోని సిద్ధంగా వారికీ అన్ని విధాలాగా అండగా ఉండాలన్నారు. మీకు ఏమి కావాలో అని చేయడానికి నేను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. మీ అందరూ ఒంగోలు అభివృద్ధిలో తోడ్పాటు అందించాలన్నారు. ఈ సందర్బంగా వారిని కోరడం జరిగింది. ఈ కార్యక్రమం బీజేపీ నాయకులు శివారెడ్డి, జనసేన నాయకులు బ్రహ్మయ్య, మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, కోటారి నాగేశ్వరావు, బండారు మదన్, తదితరులు పాల్గొన్నారు.

# యస్‌వి రంగారావుకు సరిలేరు ఎవరు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 3)

విశ్వ నట చక్రవర్తి యస్‌వి రంగారావు 106 జయంతి వేడుకలు కాపు సంఘం, ప్రకాశం జిల్లా కార్యాలయం నందు జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ ఆధ్వర్యంలో జరిగాయి. 106వ జయంతి కార్యక్రమంలో ప్రకాశం జిల్లా, కాపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్, కాపు నాయకులు గ్రంధి శ్రీనివాసరావు, తంజావూరు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ నటనలో,దానంలో మీకు మీరే సాటి, తెలుగు వాడి నటన, స్థాయిని విశ్వమంతా తెలిసేలా చేసిన మీ సామర్థ్యం తరతరాలు చెప్పుకునే విధంగా, ఆయన గొప్ప కీర్తి, ప్రతిష్ఠలు పొంది చిరస్మరణీయుడుగా వెలుగొందిన విశ్వనట చక్రవర్తి ఎస్‌వి రంగారావుకి జయంతి వేడుకలు జరుపుకుని ఆయనకు ఘన నివాళి తెలిపారు. ఈ కార్యక్రమంలో కొప్పోలు శ్రీనివాసరావు, చెన్నంశెట్టి శివ, అద్దెపల్లి మోహన్, మల్లెల చెన్నకేశవులు, చిక్కాల యల్లమంద, గుర్రం మాల్యాద్రి, వుమ్మడిశెట్టి శ్రీనివాసరావు, మట్టా శ్రీనివాసరావు, పేస్ రాంబాబు, పసుపులేటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుకు స్వాగతం పలికిన ఎంపీ మాగుంట, ఇతర ఎంపీలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 3)

ఢిల్లీలోని ఇందిరా గాంధీ విమానాశ్రయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుకు ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, సహచర పార్లమెంట్ సభ్యులు స్వాగతం పలికారు.



# వర్కింగ్ జర్నలిస్ట్‌లకు ఇంటి స్థలం ఇవ్వాలి

### విచారణకు హాజరైన జర్నలిస్ట్‌ల వాదనలు నమోదు

### 32 మందికి పట్టాలు కుట్రలో భాగమే

### అవినీతికి పాల్పడి అనర్హులకు పట్టాలు



(షణ్ముఖ వెలుగు, చీరాల, జులై 3)

జిల్లాలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు విషయంలో అక్రమాలు జరిగాయంటూ సీనియర్ జర్నలిస్ట్ నాయకుడు నాగార్జున రెడ్డి పబ్లిక్ గ్రీవెన్స్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఉదయం చీరాల తహసిల్దార్ కార్యాలయంలో విచారణ జరిగింది. విచారణకు పలువురు జర్నలిస్టులు హాజరై, చీరాలలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల మంజూరు విషయమై జరిగిన వ్యవహారాన్ని తహసిల్దార్ తో చర్చించిన అనంతరం విచారణకు హాజరైన జర్నలిస్టుల వాదనలను నమోదు చేశారు. 2018లో చీరాల తహసిల్దార్ కార్యాలయం వారు ఎటువంటి చట్టబద్ధత లేకుండా ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా కొద్దిమంది అర్హులైన జర్నలిస్టులతో కలిపి ఎక్కువమంది అనర్హులకు అక్రమ పద్ధతిలో జర్నలిస్టు ముసుగులో మొత్తం 32 మందికి ఒక్కొక్కరికి 3 సెంట్లు ఇంటి స్థలం పట్టాలు మంజూరు చేయడం జరిగింది. ఈ విషయమై అప్పటి ఉమ్మడి ప్రకాశం జిల్లా కలెక్టర్ వినయ్ చంద్‌ను స్వయంగా కలిసి ఫిర్యాదు చేయగా, సదరు పట్టాల మంజూరును తాత్కాలికంగా నిలిపివేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు చీరాల నియోజకవర్గంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరు చేయలేదు. 2024 ఎన్నికల ముందు అత్యంత గోప్యత పాటిస్తూ ఇంటి స్థలం మంజూరైన జర్నలిస్టుల జాబితా బహిర్గతం చేయకుండా గతంలో ప్రకటించిన 32 మందికి ఇంటి స్థలం మంజూరు చేస్తూ హడావిడిగా ఎన్నికల ముందు మార్చి నెల 3 తేదీన ఈపూరుపాలెం రెవెన్యూ గ్రామ సర్వే నెంబరు 859-3 నందు పొజిషన్ చూపిస్తూ ఇంటి స్థలం పట్టా మంజూరు చేశారు.

**తహసిల్దార్‌కు జర్నలిస్టులు ఫిర్యాదు :**

ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా, ఎటువంటి చట్టబద్ధతలేని విధంగానూ, సిసియల్‌ఏ అనుమతి లేకుండా, ఐ,పిఆర్ వారికి ఏమాత్రం సమాచారం లేకుండా మంజూరు చేసిన 32 పట్టాలని రద్దుచేసి చీరాల నియోజకవర్గంలోని అర్హులైన యావత్తు వర్కింగ్ జర్నలిస్టులందరికీ 3 సెంట్లు ఇంటి స్థలం మంజూరు చేయుటకు తగు చర్యలు చేపట్టడంతో పాటు చట్ట విరుద్ధంగా పట్టాల మంజూరుకు ప్రయత్నించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్‌ను కలిసిన వారిలో మీడియా కో-ఆర్డినేటర్ ఎన్ నాగార్జున, వర్కింగ్ జర్నలిస్ట్‌లు జి సూర్యప్రకాష్, డి.రాంబాబు, చుక్కా సాంభశివరావు, మిరియాల కోటేశ్వరరావు, దాసరి మణికంఠ, తదితరులు ఉన్నారు.

# స్టాక్ రిజిస్టర్ తప్పని ఉపయోగించాలి

## కె బాలాజీ నాయక్





(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, జులై 3)

దర్శి మండలంలో దర్శి పట్టణంలో గల విత్తనాల షాపులను సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాలాజీ నాయక్, మండల వ్యవసాయ అధికారి వి.బాలకృష్ణ నాయక్ షాపులను తనిఖీ చేసి షాపులో స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్ ను పరిశీలించినారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్ బిల్ బుక్స్ అప్డేట్ చేసుకోవాలని, అలాగే షాపులో ఉన్న స్టాక్ నిల్వను స్టాక్ బోర్డు పై నమోదు చేయాలని షాపు యజమానులకు తెలియజేశారు. రైతులకు విత్తనాలు అమ్మినప్పుడు తప్పనిసరిగా వారికి బిల్ ఇవ్వవలెను అని అయన సూచించారు. ఖరీఫ్ సీజన్ మొదలవుతుంది కావున రైతులు తప్పనిసరిగా కొనుగోలు చేసిన వాటికి సంబంధించి బిల్స్ తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి.బాలకృష్ణ నాయక్ సూచించారు.

# సయ్యద్ షహనాజ్‌కు డాక్టరేట్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 3)

సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహరాలు సయ్యద్ షహనాజ్‌కు ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ను ప్రదానం చేసింది. గత నెల 29న బెంగళూరులోని యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో షహనాజ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసి అవార్డు కింద 52,000 అందజేశారు. డాక్టరేట్ షహనాజ్ ఒంగోలులో సూర్య శ్రీ దివ్య చారిటబుల్ ట్రస్టును నిర్వహిస్తున్నారు. ఎంతోమంది దివ్యాంగులకు ఆశ్రమంలో వసతి కల్పించి వారి బాగో గులను చూసుకుంటున్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో తన భర్త ఫేక్ సర్దార్ భాషలతో కలిసి విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితిలోనూ షహనాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంతో మందికి భోజన వసతి కల్పించారు. ఆమె సేవలను గుర్తించిన యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. షహనాజ్‌కు గౌరవ డాక్టరేట్ రావడంపై ఒంగోలులోని ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# ఎమ్మార్పీఎస్‌ని బలపరచడానికి కృషి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 3)

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం ఏ1 గ్రాండ్ ఫంక్షన్ హాల్ నందు జిల్లా, మండల, గ్రామ కమిటీల నిర్మాణం ఎమ్మార్పీఎస్ పట్టణ నూతన కమిటీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు అయిన ఆదిమూలపు ప్రకాష్ పాల్గొన్నారు. ఈ కమిటీలో భాగంగా మందకృష్ణ మాదిగ ఆదేశాలనుసారం ఒంగోలు ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షులుగా గుంటూరి ప్రభుదాస్‌ను నియమించటం జరిగింది. ఈ కార్యక్రమంలో నూతనంగా ఏర్పడినటువంటి నగర అధ్యక్షుడు అయిన గుంటూరి ప్రభుదాస్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఎమ్మార్పీఎస్ ని జిల్లాల వారీగా మండలాలు వారిగా కమిటీని నియమించుకుంటూ ఎమ్మార్పీఎస్‌ని బలపరచడానికి తనవంతు కృషి చేస్తానని తెలియపరచడం జరిగింది. ఈ పదవి ఇచ్చినందుకు ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు అయిన మందకృష్ణ మాదిగకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషల్ పార్టీ రాష్ట్ర నాయకులు పాలడుగు రమేష్, ఆదిమూలపు సందీప్, పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దామచర్లను కలిసిన సమగ్ర శిక్ష జేఏసీ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 3)

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావును వారి గృహమునందు ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష జేఏసీ వారు కలిసి అభినందనలు తెలిపారు. సమగ్ర శిక్షలో సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి పత్రం ఇచ్చారు. ముఖ్యంగా మే, జూన్ నెల వేతనాలు వెంటనే విడుదల చేయించాలని గత ప్రభుత్వం ఏమైతే హామీలు ఇచ్చిందో అవన్నీ కూడా ఈ ప్రభుత్వం అమలు చేయాలని సమ్మె కాలపు జీతం కూడా వెంటనే ఇప్పించాలని, డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఇంకా అనేక సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. జనార్ధన్‌రావు మన ప్రభుత్వం ఇప్పుడే ఏర్పడింది కాబట్టి కొద్ది రోజులు సమయం తీసుకొని మీరిచ్చిన సమస్యలన్నీ కూడా పరిష్కారం చేసేటట్లుగా చేస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు కళ్యాణి, ప్రకాశం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ ముఖ్య నాయకులు టి రవికుమార్, రోజర్ బిన్ని, ఆనంద్, రత్నకుమారి, సుల్తాన్ భాషా, సంపత్, మాధవాచారి, శ్రీనివాసులు, వేణు, మోహన్‌రావు, పాల్గొన్నారు.

# 117వ జీవోను రద్దు చేయండి

## ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయండి



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జులై 3)

మండలంలోని పోతలపాడు గ్రామంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల ఎస్టీయూ శాఖ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఎస్టియు అధ్యక్షుడు కే ఎర్రయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్న 117వ జీవోను రద్దుచేసి, ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసినందుకు ప్రభుత్వం స్వీకారం చుట్టాలని, ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించాలని కోరారు. ప్రభుత్వం తలపెట్టిన తల్లికి వందనం కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే వర్తింప చేస్తే ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా పనిచేస్తాయని, అన్ని విధాల పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన జీఓ ను వెంటనే విడుదల చేయాలని కోరారు. 2003 సంవత్సరం డీఎస్సీ ఉపాధ్యాయులకు సిపిఎస్ కాకుండా ఓ పి ఎస్ ను వెంటనే అమలు చేయాలని అన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులలో డీఎస్సీ నిర్వహించే లోపు విద్యా వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించి బోధన కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు. ప్రతి ఎంఆర్‌సికి ఒక జూనియర్ అసిస్టెంట్ పోస్టును మంజూరు చేయాలని, సీనియార్టీ ప్రకారం ఉపాధ్యాయులకు పదోన్నతుల షెడ్యూలను విడుదల చేయాలని, ఉన్నత పాఠశాలకు డేటా ఆపరేటర్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా మైనార్టీ కన్వీనర్ ఎస్‌కె మౌలాలి, మండల ఎస్టియు అధ్యక్షుడు కేవీ జగన్ బాబు, ప్రధాన కార్యదర్శి ఎస్కె నజీర్, మండల ఎస్టియు నాయకులు సిహెచ్ కాశయ్య, కెవి నారాయణ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# డైరెక్ట్ రిక్రూట్మెంట్ విధానాన్ని కొనసాగించాలి






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 3)

1104 యూనియన్ జిల్లా ప్రాంతీయ సర్వ సభ్య సమావేశం ప్రాంతీయ శాఖ అధ్యక్షుడు సి.హెచ్. హరికృష్ణ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ కార్యాక్రమానికి ముఖ్య అతిథిగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.వి. గోపాల రావు, సి.పి.డి.సి.ఎల్. డిస్కం కార్యదర్శి యన్. శర్మ, డిస్కం అధ్యక్షుడు ఆర్. సంజీవరావు, ప్రాంతీయ శాఖ ఉపాధ్యక్షుడు బి. సురేష్ , ప్రాంతీయ కార్యవర్గం, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యంవి గోపాలరావు మాట్లాడుతూ విద్యుత్ శాఖలో గత ఐదేళ్లలో జరిగిన రిక్రూట్మెంట్ లోపభూయిష్టంగా, కార్మిక హక్కులను, వారి యొక్క శ్రేయస్సును విస్మరించడం జరిగింది. అలా కాకుండా 2014వ సంవత్సరం నుంచి 2019వ సంవత్సరం వరకు జరిగినటువంటి డైరెక్ట్ రిక్రూట్మెంట్ విధానాన్ని కొనసాగించాలని మెనేజ్మెంట్ను కోరుతున్నామని చెప్పారు. మిగతా ప్రభుత్వ శాఖలలో మాదిరిగా తేది: 31-08-2004 ముందు విద్యుత్ శాఖలో చేరినటువంటి ఉద్యోగుల ఇ.పి.ఎఫ్ టు జి.పి.ఎఫ్ కల్పించవలసినదిగా కోరారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్నటు వంటి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు పద్దతిలో పనిచేసే కార్మికులకు సమాన వేతనం అందించాలని కోరారు. తేది 01-04-2022కి సంబంధించిన పి.ఆర్.సి అగ్రిమెంట్‌లో ఉన్న లోపాలన సరిచేయవలసినదిగా మేనేజ్మెంట్ను కోరామని తెలిపారు. 5)తెలంగాణా రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులకు చెల్లించినట్లుగా జీతాలను డైరెక్ట్ వీరి అకౌంట్లలో చెల్లించే విధంగా మన రాష్ట్రంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులందరిని క్రమబద్ధీకరించాలని కోరారు ఎస్‌వోపీ నామ్స్ పేరుతో ఉద్యోగుల యొక్క జీతాల నుండి రికవరీ చేస్తున్నటు వంటి విధానాలను ఆపాలని కోరారు. గత 5 సం? కాలంలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్నటువంటి ఉద్యోగులు కొల్పోయిన హక్కులను మరియు అధికారాలను తిరిగి పొందే విధంగా నూతన ప్రభుత్వంతో కలిసి కృషి చేస్తామని తెలిపారు. విజయవాడలో తేది: 25-06-2024 గౌరవ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని కలిసి మన యొక్క అభ్యర్ధనలను చెప్పడం జరిగిందని మంత్రి కూడా సానుకూలంగా స్పందించి పరిశీలిస్తామని చెప్పారని తెలిపారు.

# శాంతి భద్రతల దృష్ట్యా, నేర నియంత్రణకు ఆకస్మిక తనిఖీలు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 3)

జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ కె నాగేశ్వరావు ఆధ్వర్యంలో ఒంగోలు టౌన్‌లోని 120 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో కలసి బుధవారం రాత్రి నేర నియంత్రణ, అసాంఘీక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, పత్రాలు లేని వాహనాలు, నంబర్ ప్లేట్ లేని వాహనాల పై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారి పై, అక్రమ గంజాయి రవాణా, అనుమానాస్పద వ్యక్తులు, కొత్త వ్యక్తుల వివరాలు ఆరా తీసి నేరాలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఒంగోలు నగర శివారు ప్రాంతాలు, నిర్మానుష్య ప్రాంతాలు, వంతెనలు, కల్వర్టులు, పార్కులు, రహదారుల ప్రక్కన పాడుబడిన భవనాలలో మొదలైన 24 ప్రదేశాలలో పోలీసులు విడివిడిగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో భాగంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న 90 మందిని అదుపులోకి తీసుకున్నారు. అదే విధంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 12 మంది పై డ్రంకన్ డ్రైవింగ్ కేసులు నమోదు చేయటం జరిగింది. పోలీస్ అధికారులు, సిబ్బంది శాంతి భద్రతల దృష్ట్యా, నేరాల నియంత్రణకు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేయడం మరియు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రాయపాటి జగదీష్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 3)

యువగళం అధినేత ఆంధ్ర ప్రదేశ్ నిరుద్యోగ విద్యార్థి యువతకు ఉద్యోగాల లక్ష్యంగా పాదయాత్రతో విజయం సాధించిన ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను రాయపాటి జగదీష్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఆప్యాయంగా పలకరించిన నారా లోకేష్ మీ అందరి వల్లే ఈ విజయం సాధ్యమైంది అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ హాస్టల్లో సన్న బియ్యం ఏర్పాటు చేయాలని ప్రకాశం జిల్లా విశ్వవిద్యాలయం త్రిబుల్ ఐటీ రామాయపట్నం పోర్టు ప్రకాశం జిల్లాలో కలపాలని పారిశ్రామిక రంగంగా దొనకొండను అభివృద్ధి చేయాలని అంబేద్కర్ జాతీయ సహకార బ్యాంక్ ఏర్పాటు చేసి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులన్నీ కూడా ఆ బ్యాంకు ద్వారా ఉపాధి నిమిత్తం యువతకు అందించాలని రాయపాటి జగదీష్ కోరారు. అందుకు లోకేష్ కచ్చితంగా మీరు ఇచ్చిన వినతిపత్రంలో అన్ని పరిశీలించి మీకు ఫోన్ చేస్తామని ప్రకాశం జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో తీసుకెళ్తామని అన్నారు. రాయపాటి జగదీష్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి నాయకులు జిల్లా అధ్యక్షులు కార్తీక్, కరుణాకర్, కృష్ణ, సూర్య, సాయి, తేజ, రాము, సాయి, సురేంద్ర, రాజీవ్, అశోక్ పాల్గొన్నారు.



# మెకానిక్‌ల సమస్యలను పరిష్కరించడంలో సహకారం అందిస్తా

## ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు











**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 3)**
మెకానిక్‌ల సమస్యలను పరిష్కరించడంలో తన వంతు సహకారం అందిస్తానని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు అన్నారు. మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెకానిక్ డే సందర్భంగా పాత జడ్పీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న దామచర్ల మాట్లాడుతూ మెకానిక్‌గా చిన్నప్పుడు నుంచి పనిచేస్తూ అంచలంచెలుగా దాయనేని ధర్మ ఎదిగారని, ఆయన్ని ఆదర్శంగా తీసుకుని మెకానిక్‌లు ఉన్నత స్థానాలను అధిరోహించాలని అన్నారు. నిత్యం శ్రమజీవులుగా మీరు పని చేస్తూ మీ జీవన బోధన గడుపుకుంటున్నారని మీయొక్క సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తామని వారన్నారు. దాయినేని ధర్మ మెకానిక్ అనే కాకుండా తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తూ మంచి స్థాయిలో ఉన్నారని మీరందరూ కూడా కేవలం వృత్తితోపాటు సామాజికంగా జరిగే సమస్యల పట్ల అర్థం చేసుకొని ప్రజలకు కూడా చేదోడువాదులుగా ఉండాలని వారు ఆకాంక్షించారు మెకానిక్‌లు అందరికీ మెకానిక్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూర్య ట్రస్ట్ స్థాపకులు మండవ మురళీకృష్ణ, మాజీ ఏఎంసి చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, నగర పార్టీ అధ్యక్షులు కొటారి నాగేశ్వరరావు, బండారు మదన్, ఒంగోలు పట్టణ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు పొదిలి, చీమకుర్తి అసోసియేషన్ సభ్యులు పాల్గొని, ర్యాలీగా బయలుదేరి అంజయ రోడ్‌లోని మెకానిక్ అసోసియేషన్ కార్యాలయం వరకు వెళ్ళారు.

# చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలికిన ఎంపీ వేమిరెడ్డి



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 3)**
ప్రధాని నరేంద్ర మోడీ, ఇతర కేంద్ర మంత్రులతో భేటీ అయ్యేందుకు ఢిల్లీ చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఢిల్లీ విమానాశ్రయానికి వెళ్లిన వేమిరెడ్డి చంద్రబాబుకి పుష్పగుచ్ఛమిచ్చి సత్కరించారు. అనంతరం ఆయనతో కొద్దిసేపు మాట్లాడారు.

# జైలు సిబ్బందికి అవగాహనా సదస్సు





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 3):**
జిల్లా జైలు, ఒంగోలు పర్యవేక్షణాధికారి పోచా వరుణా రెడ్డి జైలు సిబ్బందికి, ఖైదీలకు గ్రామీణ అభివృద్ధి , స్వయం ఉపాధి శిక్షణా సంస్థ , ఒంగోలు వారిచే అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పి. శ్రీనివాస రెడ్డి ఈ అవగాహన సదస్సులో మాట్లాడుతూ పురుషులకు , స్త్రీ లకు పలు రంగాలలో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కల్పించబడుతుందని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా ఖైదీలకు వారి జైలు జీవితం తరువాత వారి మానసిక పరిస్థితులు, ఆలోచనలు మారడానికి ఉపయోగక రంగా ఉంటుందని వరుణ రెడ్డి అన్నారు. రూడ్ సెట్ భోదనా సిబ్బంది బాపూజీ అందరికి ఈ శిక్షణ వివరాలను, శిక్షణకు నమోదు చేసుకునే విధానం వివరించారు. ఈ కార్యక్రమంలో జైలర్ వి రమేష్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

# నెల్లూరులోని వేణుగోపాలస్వామి ఆలయ ఆధునీకరణకు చర్యలు

## రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 3)**
నెల్లూరు నగరం మూలాపేటలోని ప్రసిద్ధి ఆలయమైన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాన్ని ఆధునీకరించడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావుకు సూచించారు. బుధవారం సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్‌కు మంత్రి పలు సూచనలు చేశారు. వేణుగోపాలస్వామి దేవాలయం నిధులు, ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధంగా చేయాలని సూచించారు. అలాగే నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయాన్ని తాను మంత్రి అయిన తరువాత తాను, మంత్రి నారాయణ కలిసి ఆలయాన్ని సందర్శించామని, ఆలయంలో ఎంతో ప్రసిద్ధి చెందిన అద్దాల మండపం పునర్నిర్మాణం చేపట్టేందుకు, మండపంలోని చారిత్రాత్మక చిత్రాల రూపకల్పన మొదల్కైన పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నెల్లూరు నగరంలోనే రంగనాథస్వామి ఎంతో విలువైన ఆస్తులు వున్నాయని, పూర్తిస్థాయిలో ఆస్తుల వినియోగం, ఆదాయంపై దృష్టిసారించాలన్నారు. జిల్లాలో చాలా ఆలయాలకు విలువైన ఆస్తులు, భూములు వున్నాయని, అయిననూ ధూపదీప నైవేద్యాలకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. వీటన్నింటిపై దృష్టిపెట్టనున్నట్లు ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

# వ్యాపార వాణిజ్య సంస్థల్లో పారిశుద్ధ్య ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి

## ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 3)**
సీజనల్ వ్యాధుల నియంత్రణా చర్యల్లో భాగంగా కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని వ్యాపార వాణిజ్య సంస్థల్లో కార్పొరేషన్ సూచించిన పారిశుద్ధ్య ప్రమాణాలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించేలా పర్యవేక్షిస్తున్నామని ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ తెలిపారు. స్థానిక మినీ బైపాస్ లోని వెంగమాంబ పంజాబీ ధాబా, రామలింగాపురం లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల ప్రాంగణాలను డాక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ధాబా ట్రేడ్ లైసెన్స్, ఎన్. ఓ.సి సెర్టిఫికెట్ లను పరిశీలించి మెరుగైన పారిశుధ్య చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. వంటశాలలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా, ఆహారాన్ని పరిశుభ్రంగా ఉంచేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా వంటగది వద్ద తగినంత గాలి, వెలుతురు ప్రసరించేలా, అగ్నిప్రమాదాలు జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ సూచించారు. శ్రీ చైతన్య కళాశాలలో తరగతి గదులు, మంచినీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను ప్రాంగణంలో పరిశీలించి మరింత మెరుగైన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మంచినీటి వసతిపై కళాశాల యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రాంగణంలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులను క్రమంతప్పకుండా శుభ్రం చేయాలని ఆదేశించారు. కళాశాలల్లోని ఆర్.ఓ వాటర్ ప్లాంట్ ల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించిన డాక్టర్ నిర్వాహకులకు వివిధ సూచనలు జారీచేశారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణకు నగర పాలక సంస్థ సూచించిన అన్ని ప్రమాణాలను వ్యాపార, వాణిజ్య కేంద్రాల్లో తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘించినట్లయితే లైసెన్సులు రద్దు చేస్తామని డాక్టర్ వెంకట రమణ హెచ్చరించారు.

# నూతన కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసిన రెడ్ క్రాస్ ప్రతినిధులు





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 3)**
రెడ్ క్రాస్ అధ్యక్షులు, కలెక్టర్ గా బాధ్యతలు తీసుకున్న తమీమ్ అన్సారియాను రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్ బాబు మేనేజింగ్ కమిటీ సభ్యులు వారి ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా రెడ్ క్రాస్ నిర్వహిస్తున్న వివిధ ప్రాజెక్టుల వివరాలు తెలిపారు. త్వరలో నిర్వహించే మేనేజింగ్ కమిటీ సమావేశానికి అధ్యక్షులైన కలెక్టర్‌ను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ట్రెజరర్ రాఘవ పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com